మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 27-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 298 Issue: 298

Circulated to Telangana
Published from Jagitial

27 ఏప్రిల్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:56 సూర్యాస్తమయం - సా. 6:31 ం తిథి ఏకాదశి సా. 6:19 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) రా. 9:17 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం ధ్రువ రా. 9:34 వరకు కరణం వణిజ ఉ. 6:08 వరకు విష్టి సా. 6:19 వరకు వర్జ్యం తె. 4:44 నుండి ఉ. 6:23 వరకు దుర్ముహూర్తం మ. 12:38 నుండి మ. 1:29 వరకు మ. 3:09 నుండి సా. 4:00 వరకు రాహుకాలం ఉ. 7:30 నుండి ఉ. 9:05 వరకు యమగండం ఉ. 10:39 నుండి మ. 12:13 వరకు గుళికాకాలం మ. 1:48 నుండి మ. 3:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:20 నుండి తె. 5:08 వరకు అమృత ఘడియలు మ. 2:40 నుండి సా. 4:19 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:39 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

## ఎలక్ట్రిక్ కార్లకు మంచి కాలం

### భారీగా పెరిగిన ఈవీల కొనుగోళ్లు

ముంబై: దేశీయ ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల మార్కెట్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ ఏడాది మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం అమ్మకాలు దాదాపు 87 శాతం పెరిగి 2.33 లక్షల యూనిట్లకు చేరాయి. అయితే ఈ వృద్ధి ఎక్కువగా మధ్య, అధిక ధరల వాహనాల్లోనే కనిపించింది. రూ. 20--30 లక్షల మధ్య ఉన్న ఈవీలకు డిమాండ్ పెరిగితే, తరువాయి 2 వ పేజీలో...




## మధ్యతరగతి ఇళ్లకు గడ్డు కాలం

### భారీగా తగ్గిన బడ్జెట్ ఇళ్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశంలో బడ్జెట్ ధరల ఇళ్ల అమ్మకాలు గణనీయంగా క్షీణించాయి. కొత్త నిర్మాణాలు డిమాండ్ స్థాయిలో అందుబాటులో లేకపోవడం ఈ ఏడాది జనవరి-మార్చి మధ్య అమ్మకాలు ప్రభావితం అయ్యాయని నైట్‌ఫ్రాంక్ నివేదిక తెలిపింది. తాజా నివేదిక ప్రకారం, దేశంలోని ప్రధాన ఎనిమిది నగరాల్లో రూ. 50 లక్షల్లోపు సరసమైన ఇళ్ల విక్రయాలు గతేడాది తరువాయి 2 వ పేజీలో...

## భారత్‌కు తప్పదు గడ్డుకాలం

### హార్వర్డ్ వర్సిటీ ప్రొఫెసర్ గీతా గోపీనాథ్

లండన్: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఐఎంఎఫ్ మాజీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధం ప్రపంచ ఆర్థికవ్యవస్థకు అతిపెద్ద షాక్ అని, 1970ల నాటి సంక్షోభానికి మించినదని ఆమె అభిప్రాయ పడ్డారు. ఈ ఘర్షణ సుదీర్ఘకాలం కొనసాగితే భారత్ 'ఫుడ్, ఫ్యుయెల్, ఫర్టిలైజర్ ' కొరతను ఎదుర్కొనే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. అయితే, -2 వ పేజీలో...



# ప్రజల వద్దకు.. ప్రజావాణి

## ఇకపై రెవిన్యూ డివిజన్ స్థాయిలో సేవలు

### త్వరలోనే మండల స్థాయిలోనూ ప్రారంభం.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి, వాటిని వెంటనే పరిష్కరించడం కోసం తెలంగాణలో ' ప్రజావాణి ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. 2023 డిసెంబర్ 8న సీఎం రేవంత్ రెడ్డి ప్రజాభవన్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా భవన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): ఈ కార్యక్రమం వల్ల దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు సైతం పరిష్కారం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని, ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ప్రధాన తరువాయి 2 వ పేజీలో...

## ఫ్రీగా కుట్టుమిషన్లు

### నియోజకవర్గానికి 1000 మిషన్లు

### బీసీ మహిళలకు పంపిణీ

### రాష్ట్ర సర్కారు కీలక నిర్ణయం



హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో ముఖ్యమైన సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. టైలరింగ్ నైపుణ్యం కలిగిన బీసీ మహిళలకు కుట్టు మిషన్లను అందించేందుకు జీవో జారీ చేసింది. పథకం -2 వ పేజీలో...



## కుల్లా నూనె అమ్మకాలు బంద్

### హైదరాబాద్‌లో విడి నూనె విక్రయాలపై నిషేధం

### ఆదేశాలు జారీ చేసిన హెచ్ ఫాస్ట్

తెలంగాణలో ఆహార ఉత్పత్తుల కల్తీ తీవ్ర సమస్యగా మారుతోంది. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. కల్తీ నూనెలు భారీ మొత్తంలో పట్టుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ పరిధిలో విడిగా వంట నూనెలను విక్రయించడంపై నిషేధం విధించింది. 15 రోజుల్లోగా విడి నూనెల అమ్మకాలను నిలిపేయాలని వ్యాపారులను ఆదేశించింది.

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): ఇక నుంచి ప్యాకెట్లు, టిన్‌లలో మాత్రమే వంట నూనెలను విక్రయించాలని వ్యాపారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆహార పదార్థాల కల్తీ సమస్య తెలంగాణలో తీవ్రమవుతోంది. కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లుగా కల్తీరాయుళ్లు రెచ్చిపోతు న్నారు. టీపొడి, -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,404 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,214 |




## పల్లెపల్లెన గులాబీ జెండా

### ప్రతి ఊరిలో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలి.. పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులతో కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం జరుగుతుందని తెలిపారు.

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): ఇటీవల జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించిన నేపథ్యంలో, ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ ఆదేశాల మేరకు ఈసారి ప్లీనరీని కేవలం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికే పరిమితం చేసినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, తరువాయి 2 వ పేజీలో...

# ఇల్లిల్లూ గణన

### అందరం జనగణనలో పాల్గొందాం.. మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ పిలుపు



ప్రస్తుతం దేశవ్యాప్తంవగా జరుగుతున్న జనాభా లెక్కల ప్రక్రియ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, పౌరులందరిదీ అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.ఆదివారం మన్ కీ బాత్ 133 వ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రస్తావించారు.

న్యూఢిల్లీ: ప్రతి ఒక్కరు కూడా జనగణనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని పూర్తిగా సురక్షితంగా, గోప్యంగా వుంచుతామని హామీ ఇచ్చారు. భారత జనాభా లెక్కల ప్రక్రియలోనే అతిపెద్దదని, 2027 జనాభా లెక్కల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది మొబైల్ యాప్ ద్వారా ప్రజల వివరాలు నమోదు చేస్తారని, తమ సమాచారాన్ని స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కూడా ఇస్తున్నామని తెలిపారు. నమోదు చేసుకోవడానికి వచ్చే అధికారుల రాకకు 15 రోజుల ముందు ఈ సదుపాయం అందుబాటులోకి తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




జపాన్ సివిక్ సెన్స్ చాలా గొప్పది. ఓ సారి 38 గంటల పాటు టోల్ వ్యవస్థ పనిచేయలేదు. దీంతో నిర్వాహకులు అన్ని వాహనాలను ఉచితంగానే టోల్ గేట్ దాటించారు. అయితే, తర్వాత దాదాపు 24,000 మంది వాళ్ల ఇష్టపూర్వకంగానే ఆన్‌లైన్‌లో టోల్ చెల్లించారు.



## ఉగ్రదాడిలో మాలి రక్షణ మంత్రి మృతి

బకోమా: మాలి రాజధాని బమాకో సమీపంలోని సైనిక స్థావర నగరం కాటిలో గల రక్షణ మంత్రి నివాసంపై ఉగ్రవాదులు అత్యంత వ్యూహాత్మకంగా దాడికి దిగారు. ఈ భీకర దాడిలో ఆ దేశ రక్షణ మంత్రి జనరల్ సాడియో కమారా మరణించినట్లు ఆదివారం అధికారిక వర్గాలు ధ్రువీకరించాయి. కేవలం మంత్రినే కాకుండా, ఆయన నివాసంలో ఉన్న ఆయన రెండవ భార్య, ఇద్దరు మనవళ్లను కూడా ఉగ్రవాదులు కారు



## బతికిపోయిన ట్రంప్

### వైట్‌హౌస్ సమీపంలో దుండగుడి కాల్పులు.. కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్‌లో ఘటన

అమెరికా వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్‌లో అనుకోని కాల్పుల సంఘటన జరిగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్‌తో సహా ప్రముఖ నేతలందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఎవరూ గాయపడలేదని ప్రాథమిక సమాచారం. ఈ ఘటన అమెరికా రాజకీయాల్లో మరోసారి భద్రతా సవాళ్లను ఎత్తి చూపుతోంది. వైట్ హౌస్ సమీపంలో కాల్పులు కలకలం రేపాయి.

వాషింగ్టన్ డీసీ: ట్రంప్ ఏర్పాటు చేసిన కరస్పాండెంట్స్ విలేఖరుల విందులో కాల్పులు జరిగాయి. వెంటనే ట్రంప్ ని హోటల్ నుంచి సిబ్బంది తీసుకెళ్లి పోయారు. ట్రంప్ సహా కీలక నేతలంతా ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారు. హోటల్ ని భద్రతా సిబ్బంది తమ కంట్రోల్ లోకి తీసుకున్నారు.



## యూనిఫైడ్ కేవైసీ తేవాలి: నిర్మల

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక రంగంలో యూనిఫైడ్ కేవైసీ వ్యవస్థను తీసుకురావాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఈ ప్రయత్నానికి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నాయకత్వం వహించాలని ఆమె కోరారు. శనివారం జరిగిన సెబీ 38వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుతం బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్లు వంటి ప్లాట్‌ఫారమ్‌లలో వినియోగదారులు మళ్లీ మళ్లీ కేవైసి - 2 వ పేజీలో...

## రాశి ఫలాలు



26.4.2026

మేషం: కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆర్థిక లావాదేవీలు కొంత నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు ఆలోచనలు మంచివి కావు. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం పెరుగుతుంది.

వృషభం: నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. బంధు మిత్రుల ఆగమనంతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు ఉన్నత అవకాశములు లభిస్తాయి.

మిధునం: దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు విషయంలో పునరాలోచన చెయ్యాలి. కొన్ని వ్యవహారాలలో కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ఉద్యోగ వాతావరణం గంధరగోళంగా ఉంటుంది. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

కర్కాటకం: కుటుంబ సభ్యులతో కలిసి దైవ సేవా చేసుకుంటారు. గృహ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి అవుతాయి. ఉద్యోగ వాతావరణం సంతృప్తికరంగా సాగుతుంది.

సింహం: ఆకస్మిక దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. గృహ నిర్మాణ వ్యవహారాలలో తొందరపాటు మంచిది కాదు. ఇంటాబయట అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి లభించదు. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతల వలన పనులు సకాలంలో పూర్తి చెయ్యలేరు.

కన్య: ఆప్తులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. దైవ సేవా కార్యక్రమాలకు సహాయం అందిస్తారు. నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు. దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగస్తులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

తుల: ఆర్థికంగా మరింత పురోగతి సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలు ఒక కొల్లిక్కి వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి ఆశించిన లాభాలను అందుకుంటారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి.

వృశ్చికం: ఉదర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. కొన్ని పనులు వాయిదా వేస్తారు. ఉద్యోగ విషయమై అలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

ధనస్సు: బంధువుల నుండి అందిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. వ్యాపార పరంగా ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు చివరి నిమిషంలో చేజారుతాయి. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో సొంత నిర్ణయాలు కలసిరావు. ఉద్యోగస్తులకు మిశ్రమ ఫలితాలుంటాయి.

మకరం: ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. సంఘంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన కార్యక్రమాలు ఆరంభించి సకాలంలో పూర్తిచేస్తారు. ఆత్మీయులతో వివాదాలు సర్దుమణుగుతాయి. వ్యాపార ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతారు.

కుంభం: చాలాకాలంగా పూర్తికాని పనులను పూర్తి చేస్తారు. ఆప్తుల నుండి అందిన ఆహ్వానాలు కొంత ఉత్సాహాన్నిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థికంగా ఇబ్బందులున్నప్పటికి అవసరానికి సన్నిహితుల సాయం అందుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది.

మీనం: దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆర్థికంగా కొంత ప్రతికూల వాతావరణం ఉంటుంది. ఇంటా బయట కొన్ని పరిస్థితులు ఇబ్బందికరంగా సాగుతాయి.

# ప్రజల వద్దకు..ప్రజావాణి

**మొదటి పేజీ తరువాయి**

కార్యదర్శి కె. రామకృష్ణారావుతోపాటు సీఎంవో అధికారులను ఈ మేరకు ఆదేశించారు. ప్రజావాణి సేవలను వెంటనే రెవిన్యూ డివిజన్ స్థాయిలో ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. త్వరలోనే మండల స్థాయికి కూడా విస్తరించాలన్నారు. దీని వల్ల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రాలకు వెళ్లే అవసరం ఉండదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ప్రజావాణికి వచ్చే సమస్యల పరిష్కారానికి అన్ని స్థాయిల్లోనూ అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని సీఎంవో అధికారులను సీఎం ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి.. సంబంధిత విభాగాలకు పంపించాలని.. పరిష్కార పురోగతిని అర్జీదారుడికి తెలిపాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు ఉండాలని, ఆలస్యం జరగకూడదని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలన్నారు. ప్రతి స్థాయిలోనూ ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని.. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో రాజీ పడొద్దని.. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని సీఎం సూచించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. డ్యాష్ బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే అవకాశం ఉండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యుల్ని చేయాలన్నారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించడం వల్ల జిల్లా, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కొన్ని అర్జీలను కింది స్థాయిలోనే పరిష్కరించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

# కుల్లా నూనె అమ్మకాలు బంద్

**మొదటి పేజీ తరువాయి**

మంచి నూనె, కొబ్బరి నూనెలు, టూత్ పేస్టులు.. ఇలా అన్ని రకాల వస్తువులను కల్తీ చేస్తున్నారు. ఇక వంట నూనెలను అయితే ఇష్టం వచ్చినట్లు కల్తీ చేస్తున్నారు. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో ఇటీవల భారీ మొత్తం కల్తీ నూనెలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్ ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అనాలిసిస్ అండ్ సర్వైలెన్స్ టీమ్) కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ పరిధిలో లూజ్ (విడి)గా వంట నూనెలు విక్రయించడాన్ని నిషేధించింది. ఇక నుంచి ప్యాకెట్లు, డబ్బాల్లో మాత్రమే వంట నూనెను విక్రయించాలని ఆదేశించింది. విడిగా నూనె విక్రయాలను ఆపేయడం కోసం వ్యాపారులకు సౌత్ జోన్ డీసీపీ, హెచ్‌ఫాస్ట్ ఇంఛార్జ్ అయిన గైక్వాడ్ వైభవ్ 15 రోజుల గడువు ఇచ్చారు. ఈలోగా సీల్ చేసిన, బ్రాండెడ్ ఉత్పత్తుల వైపు మళ్లాలని వ్యాపారులను ఆదేశించింది. నూనె రిఫైనరీలు, నిల్వ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని.. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఆయన సూచించారు. 15 రోజుల డెడ్ లైన్ ముగిసిన తర్వాత కూడా ఖుల్లాగా వంట నూనెలు విక్రయించే వారిపై భారత న్యాయ సంహిత, ఫుడ్ సేఫ్టీ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్‌ఫాస్ట్ ఇంఛార్జ్, డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ హెచ్చరించారు. బేగం బజార్‌లోని నూనె వ్యాపారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. వ్యాపారులు ఇక నుంచి వంట నూనెలను సీల్ చేసిన ప్యాక్‌లు, టిన్నుల్లో మాత్రమే విక్రయించాలి. అలాగే తయారు చేసిన తేదీ, ఎప్పటిలోగా వాడాలి, బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరాలను తప్పనిసరిగా పేర్కొనాలి. వంట నూనెల కల్తీకి పాల్పడిన వారు జైలుకు వెళ్లాల్సి వస్తుంది, వారి లైసెన్స్ కూడా రద్దవుతుంది. తక్కువ ధరలకు వస్తున్నాయనే ఆశకు పోయి వినియోగదారులు విడిగా లభించే వంట నూనెలను కొనుగోలు చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు. విడిగా లభించే వంట నూనెలను కల్తీ చేయడానికి అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు ఆర్జిమోన్ నూనె అనేది అచ్చం ఆవ నూనెలాగే ఉంటుంది. చౌకగా దొరికే ఈ నూనెను ఖరీదైన ఆవ నూనెలో కలుపుతుంటారు. అలాగే తక్కువ ధరకే దొరికే పామ్ ఆయిల్‌ను ఖరీదు ఎక్కువగా ఉండే వేరుశనగ, పొద్దుతిరుగుడు నూనెల్లో కలిపి కల్తీ చేస్తుంటారు. హోటళ్లు, ఫంక్షన్లలో పదే పదే మరిగించిన నూనెను కొనుగోలు చేసి రసాయనాలతో శుద్ధి చేసి, కొత్త నూనెలలో కలిపి విక్రయించేవారు కూడా ఉంటారు. కల్తీ నూనెలు వాడటం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు, లివర్ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి ప్రమాదకర ప్రాణాంతక వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉంటుంది.

# ఇల్లిల్లూ గణన

**మొదటి పేజీ తరువాయి**

వస్తుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే ఓ ప్రత్యేకమైన ఐడీ లభిస్తుందని, ఈ ఐడీ మొబైల్ ఫోన్ కి లేదా, ఈమెయిల్ కి పంపిస్తారన్నారు. లెక్కల సేకరణ సమయంలో ఇంటికి వచ్చే వారికి ఈ ఐడీ చూపించడం ద్వారా వివరాలను సరి చూసుకోవచ్చని, దీని వల్ల సమాచారాన్ని మళ్లీ అందించాల్సిన అవసరం వుండనే వుండదని మోదీ సూచించారు. ఇక.. మన్ కీ బాత్ లో పవన శక్తి ఉత్పత్తిలోనూ భారత్ మరో మైలురాయి దాటిందన్నారు. దేశం ముందుకు వెళ్లాలంటే సౌర, పవన శక్తులు చాలా ముఖ్యమన్నారు. పునరుత్పాదక విద్యుత్ వల్ల భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా వుంటుందని, పనవ శక్తి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నాలుగో స్థానంలో వుందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 56 గిగావాట్లకు పైగా పవన శక్తిని ఉత్పత్తి చేస్తున్నామని, గత యేడాదితో పోలిస్తే 6 గిగావాట్ల పవన శక్తి అదనంగా ఉత్పత్తి అవుతోందన్నారు. అలాగే అణుశక్తి పరిశోధనల్లో భారత్ మరో అడుగు వేసిందని కల్పక్కంలో విషయాన్ని గుర్తు చేశారు. తమిళనాడులోని కల్పక్కంలో వున్న 500 మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ దేశ దీర్ఘకాలిక అణు వ్యూహంలో ఓ మూలస్తంభం అని కొనియాడారు. ఈ విషయంలో మన అణు శాస్త్రవేత్తలు విజయాన్ని సాధించి, దేశానికి గొప్ప పేరు తీసుకొచ్చారన్నారు. ఈ అణు రియాక్టర్ ను పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతో నిర్మించడం విశేషమని మోదీ అన్నారు.

బెంగాల్ శరణార్థులకు పౌరసత్వం ఇస్తాం

ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో స్పీడ్ పెంచారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేసుకుని కీలక ప్రాంతాల్లో భారీ సభలు నిర్వహిస్తు ఓటర్లకు హామీలు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఆదివారం బంగగావ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. గంగానది గంగోత్రిలో జన్మించినట్లు, భారతీయ జనతా పార్టీకి మూలమైన జనసంఘ్ బెంగాల్ గడ్డపైనే పుట్టిందని ఆయన గుర్తుచేశారు. విభజన సమయంలో శరణార్థుల పక్షాన నిలిచిన డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తోందని, శరణార్థి కుటుంబాల బాగోగులు చూసుకోవడం భారతదేశ చారిత్రక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. శరణార్థులందరికీ పౌరసత్వం కల్పించడం తన బాధ్యత అని పేర్కొంటూ, పౌరసత్వ సవరణ చట్టం ప్రాధాన్యతను మోదీ ఓటర్లకు వివరించారు. ముఖ్యంగా మతువా, నమఃశూద్ర వంటి శరణార్థి కుటుంబాలకు శాశ్వత చిరునామా, పౌరసత్వ పత్రాలు, భారతీయ పౌరుడికి ఉండే అన్ని రాజ్యాంగపరమైన హక్కులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. "ఇది మోదీ గ్యారెంటీ" అని భరోసా ఇస్తూ, బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పౌరసత్వ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని ప్రకటించారు. విపక్షాలు శరణార్థులను భయపెడుతున్నాయని మండిపడుతూ, వారి భవిష్యత్తుకు బీజేపీ అండగా ఉంటుందని మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారు.

## ఉగ్రదాడిలో మాలి రక్షణ మంత్రి మృతి

**మొదటి పేజీ తరువాయి**

బాంబులు, భారీ ఆయుధాలతో పొట్టనపెట్టుకున్నారు. ఈ ఘాతుకానికి అల్–ఖైదా అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్–ఇస్లాం వాల్–ముస్లిమిన్, తువారెగ్ వేర్పాటువాద గ్రూపు అజావాద్ లిబరేషన్ ఫ్రంట్ సంయుక్తంగా బాధ్యత వహించాయి. ఈ దాడులు కేవలం మంత్రి నివాసానికే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా ఏకకాలంలో పలు ప్రధాన నగరాలపై జరిగాయి. రాజధాని బమాకో లోని విమానాశ్రయం, సెవారే, గావో, కిడాల్ వంటి కీలక సైనిక స్థావరాలపై ఉగ్రవాదులు మెరుపుదాడులు చేశారు. 2020లో సైనిక తిరుగుబాటు ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వంపై ఇది ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద దాడి అని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం మాలి ప్రభుత్వం దేశవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించి, రాజధాని నగరంలో కఠినమైన కర్ఫ్యూ విధించింది. రక్షణ మంత్రి మరణం మాలి సైన్యానికి, ప్రస్తుత పాలకులకు కోలుకోలేని దెబ్బ.

# పల్లెపల్లెన గులాబీ జెండా

**మొదటి పేజీ తరువాయి**

కార్పొరేషన్ల మాజీ చైర్మన్లకు మాత్రమే ఆహ్వానం ఉందని పార్టీ స్పష్టం చేసింది. తెలంగాణ భవన్‌లో పరిమిత సంఖ్యలోనే ప్రవేశం ఉంటుందని, ఆహ్వానం ఉన్న వారు మాత్రమే హాజరుకావాలని, మిగిలిన నాయకులు, కార్యకర్తలు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ కోరారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామం, మండలం, పట్టణం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉదయాన్నే స్థానిక ప్రాంతాల్లో జెండా పండుగ ముగించుకుని, మధ్యాహ్నం 1:30 గంటల కల్లా హైదరాబాద్ చేరుకోవాలని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధులకు సూచించారు.

దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు అంతా ముందుకు వస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆదివారం హుజూర్ నగర్ నియోజకవర్గం నుంచి పలువురు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో హుజూర్ నగర్‌లో భారీగా ఓట్లు వచ్చాయి. దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు అంతా ముందుకు వస్తున్నారు.

హుజూర్‌నగర్‌లో గతంలో ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు మారలేదు. కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి. హుజూర్ నగర్ నియోజకవర్గంలో అనామకుడైన సైదిరెడ్డిని గెలిపించాం. 2023 శాసన సభ ఎన్నికల్లో ఓడిపోగానే పార్టీని వదిలిపెట్టి పోయారు.

హుజూర్ నగర్‌లో దుర్మార్గమైన కాంగ్రెస్ వైఖరిని బీఆర్ఎస్ శ్రేణులు పోరాట స్ఫూర్తితో ఎదుర్కొంటున్నారు. సైదిరెడ్డి ఆయన సొంత ఊరులో సర్పంచ్‌ని గెలిపించుకోలేక పోయారు. ఆనాడు జలదృశ్యంలో గులాబీ జెండా ఎగిరింది. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగిరి 25 యేండ్లు పూర్తి చేసుకొని 26 వసంతంలోకి అడుగుపెడుతోంది. దేశంలో ఏ పార్టీకి లేని విశిష్టత ఒక్క బీఆర్ఎస్ పార్టీకే ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి ఐడెంటిటీ క్రైసిస్ ఉంది.. అందుకే కేసీఆర్‌ను విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి పేరును ఎవరూ గుర్తు పెట్టుకోవడం లేదు. రేవంత్ పేరు చెప్పాలంటేనే మొహం తిప్పుకుంటున్నారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది.

ఒక్కొక్క కాంగ్రెస్ నేత కమల్‌హాసన్‌ను మించి యాక్టింగ్ చేస్తున్నారు. వంద రోజుల్లోనే గ్యారెంటీలు అమలు చేస్తామని నమ్మించారు. బాండ్లు పేపర్లు రాసి, దేవుడి మీద ఒట్టు వేశారు. 420హామీలు, 13 డిక్లరేషన్లు ఏమయ్యాయి?. మాటలు ఆకాశన్నంటాయి.. చేసింది మాత్రం సున్నా.. కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామని నల్గొండ రైతులు చెబుతున్నారు'అని పేర్కొన్నారు.

## ఫ్రీగా కుట్టుమిషన్లు

**మొదటి పేజీ తరువాయి**

అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్, నియోజకవర్గానికి 1000 కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఉచిత ఆటోమేటిక్ కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. బీసీ కులాలకు చెందిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా, వారికి సొంతంగా ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. కేవలం సాధారణ మిషన్లే కాకుండా, ఆధునిక సాంకేతికతతో కూడిన ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించనుంది ప్రభుత్వం. తెలంగాణలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1,000 చొప్పున కుట్టు మిషన్లను కేటాయించింది. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రభుత్వం అమలు చేస్తోంది. కుట్టుపనిలో ఇప్పటికే నైపుణ్యం కలిగి ఉండి, సరైన యంత్రాలు లేక ఇబ్బంది పడుతున్న బీసీ మహిళలకు ఈ పథకంలో మొదటి ప్రాధాన్యం కల్పించనుంది. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, ఆటోమేటిక్ కుట్టు మిషన్ల ద్వారా పని వేగంగా, నాణ్యతగా జరుగుతుంది. సాధారణ మిషన్లతో పోలిస్తే వీటి ద్వారా ఆదాయం ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో, ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల నిరుపేద మహిళలు దర్జీలుగా మారి తమ కుటుంబాన్ని పోషించుకోగలరని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించి అర్హతలు, వయసు పరిమితి, దరఖాస్తు చేసుకోవాల్సిన విధానంపై ప్రభుత్వం త్వరలోనే అధికారిక మార్గదర్శకాలను విడుదల చేయనుంది. దరఖాస్తుదారులు బీసీ వర్గానికి చెందిన వారై ఉండాలి. వార్షిక ఆదాయ పరిమితి వంటి నిబంధనలు ఉండే అవకాశం ఉంది.

## భారత్‌కు తప్పదు గడ్డుకాలం

**మొదటి పేజీ తరువాయి**

ఉద్రిక్తతలు తొందరగా తగ్గుముఖం పడితే, తక్షణ ప్రభావం పరిమితంగానే ఉండవచ్చని ఆమె అన్నారు. ఈ పరిణామాల మధ్య భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చు. చమురు, ఎరువుల విషయంలో భారత్ ఎక్కువగా పశ్చిమాసియా ప్రాంతంపైనే ఆధారపడుతోంది. ఇరాన్ యుద్ధం కొనసాగడం వల్ల ధరలు పెరగడం కంటే సరఫరా సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉంటాయి. ఇదే సమయంలో ఇరాన్ ఉద్రిక్తతలు ఎంతకాలం ఉద్రిక్తతలు కొనసాగుతాయనే దాన్ని బట్టి ప్రపంచ వృద్ధి ఉండనుంది. యుద్ధం ముగిస్తే ప్రపంచ వృద్ధి 0.3 శాతం మాత్రమే తగ్గుముఖం పట్టొచ్చు. క్రూడ్ ధరలు 100 డాలర్ల పరిధిలోనే కొనసాగితే వృద్ధి 2.5 శాతానికే పరిమితం అవ్వొచ్చని గీతా గోపీనాథ్ అంచనా వేశారు.

## మధ్యతరగతి ఇళ్లకు గడ్డు కాలం

**మొదటి పేజీ తరువాయి**

కంటే 23 శాతం తగ్గి 16,273 యూనిట్లకు పడిపోయాయి. కోవిడ్ మహమ్మారి తర్వాత, విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ పెరిగింది. కీలక ముడిసరుకుల ఖర్చు పెరగడంతో బిల్డర్లు కూడా సరసమైన గృహాల విభాగంలో కొత్త ప్రాజెక్టులను తీసుకురావడం తగ్గించారు. డేటా ప్రకారం, రూ. 50 లక్షల నుంచి రూ. కోటి విభాగంలోని ఇళ్ల అమ్మకాలు 12 శాతం తగ్గి 23,567 యూనిట్లకు చేరాయి. రూ. 1-2 కోట్ల మధ్య ఇళ్లు 10 శాతం పెరిగి 24,657 యూనిట్లకు, రూ. 2-5 కోట్ల విభాగంలో 17 శాతం పెరిగి 16,075 యూనిట్లకు రూ. 5-10 కోట్ల విభాగంలో విక్రయాలు 3 శాతం తగ్గి 3,338 యూనిట్లకు చేరాయి. రూ. 10-20 కోట్ల విభాగంలో గృహాల అమ్మకాలు 12 శాతం పెరిగి 738 యూనిట్లకు చేరుకోగా, రూ. 20-50 కోట్ల విభాగంలో అమ్మకాలు 80 శాతం పెరిగి 165 యూనిట్లకు చేరుకున్నాయి.

## ఎలక్ట్రిక్ కార్లకు మంచి కాలం

**మొదటి పేజీ తరువాయి**

రూ. 10 లక్షల లోపు చవక వాహనాల వాటా తగ్గింది. అంటే, ఈవీలు సాధారణ వినియోగదారులకు ఇంకా పూర్తిగా అందుబాటు ధరలో లేవని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో మిడ్-సైజ్ ఎస్‌యూవీలు అమ్మకాలను నడిపిస్తున్నాయి. ఎంఅండ్ఎం, టాటా మోటార్స్ వంటి కంపెనీల మోడళ్లకు ఎక్కువ ఆదరణ కనిపిస్తోంది. ఎంట్రీ-లెవల్ ఈవీల విభాగంలో ఎక్కువ మోడల్స్ లేకపోవడంతో వృద్ధి మందగించింది. నిపుణుల ప్రకారం, రూ. 10--12 లక్షల లోపు మంచి ఈవీలు అందుబాటులోకి రాకపోతే, ఈవీ మార్కెట్ విస్తరణ నెమ్మదిగానే సాగుతుంది. దీనికి ప్రధాన కారణం బ్యాటరీ ఖర్చులు ఎక్కువగా ఉండటమే. కొత్త ప్రభుత్వ నిబంధనలు వాహన తయారీదారులను మరిన్ని ఈవీలు తయారు చేయడానికి ప్రోత్సహిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి.

## యూనిఫైడ్ కేవైసీ తేవాలి: నిర్మల

**మొదటి పేజీ తరువాయి**

చేయాల్సి వస్తోందని, ఈ ఇబ్బందిని తగ్గించేందుకు ఒకే విధానం అవసరమని తెలిపారు. అన్ని చోట్ల ఒకే కేవైసీ ఉండాలని తెలిపారు. ప్రస్తుత కేవైసీ విధానం వేర్వేరుగా ఉండటంతో వినియోగదారులకు అసౌకర్యం కలుగుతోంది. అందుకే, డిజిటల్ టెక్నాలజీ సహాయంతో సురక్షితమైన, సులభమైన, ఎక్కడైనా ఉపయోగించగల కేవైసీ వ్యవస్థ అవసరమని అన్నారు. ఇది అమలైతే ప్రజలకు ఆర్థిక సేవలు మరింత సులభం అవుతాయని పేర్కొన్నారు.



# దేశానికి జనాభా లెక్కలు పునాదిరాయి

## ప్రజలంతా జనగణనలో పాల్గొనాలి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపు

## పోర్టల్‌లో తన వివరాలు నమోదు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): 2027 జనాభా లెక్కలకు సంబంధించి తెలంగాణలో 2026 ఏప్రిల్ 26న స్వీయ గణన అధికారికంగా ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ. కిషన్ రెడ్డి.. నిర్ణీత ఆన్‌లైన్ జనగణన పోర్టల్ ద్వారా తన వివరాలను నమోదు చేశారు. తెలంగాణ జనగణన కార్యాలయం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రయాణంలో జనాభా లెక్కలు ఒక పునాది రాయి వంటివని అన్నారు. ప్రణాళికా రచన, సుపరిపాలన, సమానాభివృద్ధికి ఇవి కీలక సాధనాలుగా ఆయన అభివర్ణించారు. సమర్థవంతమైన విధాన రూపకల్పన, సమ్మిళిత వృద్ధికి ఖచ్చితత్వంతో కూడిన సమగ్రమైన గణాంకాలు చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించిన శ్రీ జీ. కిషన్ రెడ్డి... ఆధునిక డిజిటల్ సాంకేతికతను ఉపయోగించటం ద్వారా ఇదొక పరివర్తనాత్మక దశగా నిలుస్తుందని పేర్కొన్నారు. తద్వారా పారదర్శకత, సామర్థ్యం, సమ్మిళితత్వం మరింత పెరుగుతాయని ఆయన అన్నారు. 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన సౌకర్యం అందుబాటులో ఉంటుందని.. ఆ తర్వాత 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు గృహ జాబితా సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇది సమగ్ర సమాచార సేకరణకు బలమైన పునాది వేస్తుందని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక–ఆర్థిక పరిస్థితులపై 2027 జనాభా లెక్కలు స్పష్టమైన అవగాహనను కల్పిస్తాయని.. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడటంలో ఇవి సహాయపడతాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. జనాభా లెక్కల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరిన కేంద్ర మంత్రి.. ఇందులో ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. సేకరించే ప్రతి సమాచారం దేశ భవిష్యత్తుతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ జనాభా లెక్కల డైరెక్టరేట్ సంచాలకులు భారతి హోళికేరి మాట్లాడుతూ.. అధికారిక వెబ్‌సైట్‌లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని, తద్వారా జనాభా లెక్కల్లో నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. సమర్పించిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమాచారాన్ని సమర్పించిన వెంటనే ఒక 'స్వీయ గణన ఐడీ' వస్తుందని.. ఆ తర్వాత జనగణన అధికారి (ఎన్యూమరేటర్) దానిని పరిశీలించి ఖరారు చేస్తారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్‌తో

# బీఆర్ఎస్ వెన్నులో వణుకు

### కారు పార్టీ ముమ్మాటికీ సోషల్ మీడియా పార్టీనే

### కవితనే టీఆర్ఎస్‌కు నిజమైన హక్కుదారు

### బీఆర్ఎస్ నేతలకు టీఆర్ఎస్ నేతల కౌంటర్



హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ఏర్పాటుతో బీఆర్ఎస్ నాయకుల వెన్నులో వణుకు పుట్టించిందని టీఆర్ఎస్ నాయకులు అన్నారు. కవిత ఇచ్చిన మాస్టర్ స్ట్రోక్ తో ఆ పార్టీ నాయకులు మతి తప్పి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎల్. రూప్ సింగ్, రంగు నవీన్ ఆచారి, సయ్యద్ ఇస్మాయిల్, గొంగళ్ల రంజిత్ కుమార్, మంచాల వరలక్ష్మి, నరేశ్ ప్రజాపతి మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ పేరుతో కవిత పార్టీ పేరు ప్రకటించగానే బీఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ లో ఒరిజినల్, డూప్లికేట్ అంటూ చేసిన పోస్టులు పెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**టీఆర్ఎస్ కు కవితక్కే హక్కుదారు : నవీన్ ఆచారి**

టీఆర్ఎస్ కు నిజమైన హక్కుదారు కవితనే అని రంగు నవీన్ ఆచారి అన్నారు. బీఆర్ఎస్ వదిలేసిన తెలంగాణవాదాన్ని కవిత భుజాన ఎత్తుకున్నారని గుర్తు చేశారు. అధికారం వచ్చిన వెంటనే తెలంగాణవాదాన్ని, ఉద్యమకారులను వదిలేసిన చరిత్ర మీది కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సభలకు జనాన్ని సమీకరించిన వ్యక్తులను కొట్టి చంపించిన కడియం శ్రీహరిని పార్టీలోకి తెచ్చుకొని ఉప ముఖ్యమంత్రిని చేసింది మీరు కాదా అని నిలదీశారు. తెలంగాణవాదులను లాఠీలతో కొట్టించిన వారికి మంత్రి పదవులు ఇచ్చిన మీరా తెలంగాణ వాదం గురించి మాట్లాడేది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ తల్లి విగ్రహాలు, తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్ విగ్రహం పెట్టేందుకు ఏమీ ఇబ్బంది వచ్చిందంటూ బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. మీ పార్టీ కోసం తెలంగాణవాదాన్ని చంపేసిన మీరా ఒరిజినల్ అని మాట్లాడేది అంటూ విమర్శలు గుప్పించారు. తెలంగాణవాదులు, అస్తిత్వాన్ని అవమానించినందుకు బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలన్నారు. తెలంగాణవాదం లేదని చెప్పిన జీవన్ రెడ్డిని పార్టీలోకి తెచ్చుకొని ఏం సంకేతం ఇస్తున్నారని ప్రశ్నించారు. తమది నక్సలైట్ల ఆర్థిక విధానానికి దగ్గరి విధానం అని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత నవ యువకులు శృతి, సాగర్ లను నక్సలైట్ల పేరుతో చంపింది నిజం కాదా అని ప్రశ్నించారు. సిద్ధాంతం వేరైతే మన పిల్లలని కూడా చూడకుండా చంపేస్తారా అని విమర్శించారు. పదేళు అధికారంలో ఉండి ట్యాంక్ బండ్ పై తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేకపోయారని అన్నారు. స్థలం కేటాయిస్తే జాగృతి నుంచి తామే విగ్రహం ఏర్పాటు చేయిస్తామని ప్రతిపాదనలు ఇచ్చినా ఆ రోజు పట్టించుకోలేదన్నారు. అధికారికంగా ఒక్కటంటే ఒక్క తెలంగాణతల్లి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయలేని వాళ్లు ఒరిజినల్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల ఆశయాలను కాపాడే గొప్ప అడ్మినిస్ట్రేషన్ ను కవిత ప్రజల ముందుకు తీసుకువస్తారని తెలిపారు.

**బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి చెప్తాం : రూప్ సింగ్**

టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ గా మారినప్పుడే తెలంగాణ సమాజం మిమ్మల్ని తిరస్కరించిందని తెలంగాణ రాష్ట్ర సేన నాయకులు రూప్ సింగ్ అన్నారు. పెయిడ్ బ్యాచ్ ద్వారా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయాలని చూస్తే తగిన బుద్ధి చెబుతామని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు.

**తెలంగాణవాదంపై హక్కు ఏనాడో కోల్పోయారు : గొంగళ్ల రంజిత్**

తెలంగాణ అస్తిత్వ పోరను వదిలేసి.. బీటీ బ్యాచ్ ను పోగు చేసిందే బీఆర్ఎస్ నేతలని తెలంగాణ రాష్ట్ర సేన నాయకులు గొంగళ్ల రంజిత్ కుమార్ విమర్శించారు. తెలంగాణ మీద ఏనాడో హక్కు కోల్పోయిన మీకు ఒరిజినల్ అంటూ మాట్లాడే హక్కు లేదన్నారు. అసలు తెలంగాణ ఉద్యమంలో కవిత పాత్ర ఏంటో తెలియక కొంతమంది పిల్ల బచ్చాలు సోషల్ మీడియాలో పేట్రేగిపోతున్నారని మండిపడ్డారు. 2009లో మహబూబ్ నగర్ ఎంపీగా కేసీఆర్ ను గెలిచేందుకు కవితక్కనే కారణమన్న విషయం మీ అధినాయకుడిని అడిగి తెలుసుకోవాలన్నారు. కేసీఆర్ సచ్చుడో -- తెలంగాణ వచ్చుడో అని శపథం చేసి నెలన్నరకు పైగా ఢిల్లీలో కేసీఆర్ ఇంటికి పరిమితమైనప్పుడు కవితక్క ఆస్కార్ ఫెర్నాండేజ్ తో మాట్లాడి సోనియాగాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పిచ్చారని గుర్తు చేశారు. ఆ మీటింగ్ ఏర్పాటు చేయించి ఉండకపోతే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పరిస్థితి ఏమిటో ఉద్యమ నాయకుడిని అడిగి తెలుసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ముమ్మాటికీ సోషల్ మీడియా పార్టీనే.. ఆ పార్టీ నాయకులు ఇప్పుడే ఇంత ఆగమైతే ముందుంది వాళ్ల పరిస్థితి ఏమిటో అర్థమవుతుందన్నారు. దెబ్బ తిన్న పులి గర్జన ఏ విధంగా ఉంటుందో ముందు ముందు తెలుస్తుందని హెచ్చరించారు.

**ఇక నుంచి ఇంకో లెక్క : సయ్యద్ ఇస్మాయిల్**

తెలంగాణవాదం ఎత్తుకొని టీఆర్ఎస్ పేరుతో కవిత ప్రజల ముందుకు రావడాన్ని కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారని తెలంగాణ రాష్ట్ర సేన నాయకులు సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం కొత్త ప్రయత్నం మొదలైందని అన్నారు. ఇది తట్టుకోలేక తమ అనుచరగణంతో విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా పునాదులపై నిర్మించుకున్న భవనాలు ఇక నేలకూలటం తథ్యమని చెప్పారు. ఇక నుంచి తెలంగాణవాదంపై, కవితపై ట్రోల్స్ చేయాలంటే ఒళ్లు దగ్గరపెట్టుకోవాల్సిన పరిస్థితి తీసుకొస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క ఉంటుందన్నారు.

**జీవన్ రెడ్డి తెలంగాణ వ్యతిరేకి: మంచాల వరలక్ష్మీ**

టీఆర్ఎస్ ఆవిర్భావాన్ని జీవన్ రెడ్డి విమర్శించటం హాస్యస్పదంగా ఉందని తెలంగాణ రాష్ట్ర సేన నాయకురాలు మంచాల వరలక్ష్మి అన్నారు. గతంలో కేసీఆర్ పై అవాకులు, చెవాకులు పేలిన జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ తమ పార్టీలోకి చేర్చుకొని ఒరిజినల్, డూప్లికేట్ అని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తెలంగాణ గాలికి వదిలేసి పార్టీ పేరును బీఆర్ఎస్ గా మార్చుకున్నోళ్లకు.. తెలంగాణ ఆత్మను ఆవిష్కరించేందుకు కొత్త పార్టీతో ముందుకు వస్తున్న కవితకు పోలికే లేదన్నారు. ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచిన వారిని నడిరోడ్డు మీదకు వదిలేసిన మీకు ఒరిజినల్ అని మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. తన తండ్రిపై కవిత విమర్శలు చేసిందని మాట్లాడుతున్న వారు మారిన కేసీఆర్ గురించి మాట్లాడరనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు.

**మీది టీఆర్ఎస్సా, బీఆర్ఎస్సా? : నరేశ్ ప్రజాపతి**

అసలు మీరు టీఆర్ఎస్సా, బీఆర్ఎస్సా ముందు చెప్పాలని తెలంగాణ రాష్ట్ర సేన నాయకులు నరేష్ ప్రజాపతి ప్రశ్నించారు. కేటీఆర్ ఇన్ స్టా అకౌంట్ లో టీఆర్ఎస్ అని, ట్విట్టర్ అకౌంట్ లో బీఆర్ఎస్ అని పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ ఏంటో వారికే క్లారిటీ లేదని విమర్శించారు. తాము టీఆర్ఎస్ అనే పేరుతో పార్టీ పెడతామని తెలిసి మళ్లీ తమ పార్టీ పేరును టీఆర్ఎస్ గా మార్చుతామని చెప్పింది మీరు కాదా అని ప్రశ్నించారు. అమరుల కుటుంబాలను, ఉద్యమకారులను, తెలంగాణ ప్రజలను మోసం చేసిన మీరా ఒరిజినల్ అంటూ మాట్లాడేది అని విమర్శించారు. ఇక నుంచి తెలంగాణ వాదం, తెలంగాణ అస్తిత్వాన్ని రక్షించేది కవితక్క అని స్పష్టం చేశారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# టీజీలో పెట్రో కొరత లేదు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్‌సరఫరాకు నిల్వలు సమృద్ధిగా ఉన్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ తెలిపింది. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ అపోహలకు గురి కావద్దని తొందర పడి బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు చేయరాదని సూచించింది. రోజుకు 9,574 కిలోలీటర్ల పెట్రోల్, 14,457 కిలో లీటర్ల డీజిల్, మొత్తం 24 వేల కిలో లీటర్లపైగా పెట్రోల్, డీజిల్‌ను బంకుల ద్వారా వాహనదారులకు అమ్మకాలు చేస్తున్నట్లు వెల్లడించింది.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

### తెలంగాణ రైతుల కోసం కొత్త కార్యక్రమం

నేటి నుంచి ప్రారంభం.. మే 23 వరకు నిర్వహణ

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): రాష్ట్రంలోని రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమం అమలు చేయనుంది. రైతుల కోసం సోమవారం నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరుతో కార్యక్రమం చేపట్టనుంది. మే 23వ తేదీ వరకూ తెలంగాణ వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరగనుంది. ఈ విషయాన్ని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాలలో పర్యటించనున్నారు. ఇందుకోసం వ్యవసాయ యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలతో కలిసి 200 బృందాలను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఈ బృందాలు గ్రామాలలో పర్యటించి రైతులతో సమావేశం కానున్నాయి. ఈ సందర్భంగా గ్రామాల్లోని రైతులకు వివిధ అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. అందుకు అవసరమైన శిక్షణ కూడా అందిస్తారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, సాగునీటి పొదుపు, ఎరువుల వినియోగం, యూరియా వాడకాన్ని తగ్గించటం వంటి అంశాలపై ఈ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారిస్తారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మరోవైపు తెలంగాణలో రైతులకు పంపిణీ చేయడానికి 8 రకాల వరి వంగడాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న రకాలనే రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ సోన, బీపీటీ 5204, జైశ్రీరాం, కేఎన్ఎం 1638, హెచ్ఎంటీ, డబ్ల్యూజీఎల్ 44, టీజీసీ 1798, డబ్ల్యూజీఎల్ 962 రకాలను రైతులకు అందించనున్నారు. వానకాలం ప్రారంభానికి ముందే రైతులకు విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మరోవైపు తెలంగాణ మీద ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంచనా వేశారు. ఎల్ నినో కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో పండే నూనె గింజలు, ఆయిల్ పామ్, పప్పుధాన్యాల సాగు వైపు రైతులు ఆలోచనలు చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా.. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు.

# జనగణనలో పాల్గొన్న సీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): తెలంగాణలో సెన్సస్ 2027 ప్రక్రియ ఆదివారం అధికారికంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తన వివరాలను అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా నమోదు చేసి, సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వయం నమోదు) ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఈ ప్రక్రియ మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లను కలిపి ఒకే యూనిట్‌గా ఈ జనగణన చేపడుతున్నారు. మే 10 వరకు ప్రజలు స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈ 15 రోజుల పాటు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. పౌరులు అధికారిక వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి, తమ వివరాలను సమర్పించవచ్చు. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుంది. ఇందులో గృహ, వసతులు, ఆస్తులకు సంబంధించిన 33 ప్రశ్నలు ఉంటాయి. ఎలాంటి పత్రాలు అవసరం లేదని, 15–20 నిమిషాల్లో ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. వివరాలు సమర్పించాక వచ్చే సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ (ఎస్ఈ ఐడీ)ని, వెరిఫికేషన్ కోసం వచ్చే సిబ్బందికి చూపించాల్సి ఉంటుంది. ఇది భారతదేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి డిజిటల్ జనగణన కావడం విశేషం.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))


| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines - Rs.450 (for each extra line - Rs.90)

COLOUR: Price for 5 Lines - Rs.500 (for each extra line - Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com



## బీఆర్ఎస్ జెండాలు ఎగరాలి: కొప్పుల



ధర్మపురి, ఏప్రిల్ 26 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండాలను ఎగురవేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 27న ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని మండల, గ్రామ స్థాయిలో జెండా ఎగురవేత కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కొప్పుల ఈశ్వర్ సూచించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోని కార్యకర్తలు, కమిటీలు, మహిళా మరియు యువజన విభాగాలు సమన్వయంతో కలిసి జెండా ఎగురవేత కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 26 (ఈవార్తలు): సారంగాపూర్ మండలం లచ్చక్కపేట గ్రామానికి చెందిన గోపీనేని రాజమల్లు-లావణ్య దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద మంజూరైన గృహానికి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ఆహ్వానం మేరకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరై గృహాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చీరను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లచ్చక్కపేట సర్పంచ్ చెట్లపల్లి రమ భాస్కర్, నాగునూరు సర్పంచ్ శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమణారావు, తోడేటి శేఖర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆకుల తిరుపతి, తోట మల్లయ్య, అనుపుర రాజనర్సు, అత్తినేని శ్రావణ్ కుమార్, ఎవ్వం గంగాధర్, దెబ్బడ శ్రీధర్, జంగిలి మహేష్, డాక్టర్ రమేష్, బొమ్మన తిరుపతి, తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా అంబేద్కర్ స్మరణ కార్యక్రమం

జగిత్యాల, ఏప్రిల్ 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రతి వారం నిర్వహిస్తున్న అంబేద్కర్ స్మరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడు, డిక్కీ జిల్లా కో-ఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజ సుమన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ సుమన్ రావు మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు అపారమని, రాజ్యాంగం ద్వారా సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అందరికీ అందేలా మార్గం చూపారని అన్నారు. సమాజంలో ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నల్ల శ్యామ్ మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తరించేందుకు ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు యువత ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, అంబేద్కర్ వాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి బాలుడు మృతి

బుగ్గారం, ఏప్రిల్ 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. బుగ్గారం మండలం బీర్సాని గ్రామానికి చెందిన కాంపెల్లి రితేష్ (తండ్రి: సంపత్--మృతుడు) అనే బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించాడు. వివరాల ప్రకారం, రితేష్ గొల్లపల్లి మండలం లోతునూరు గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావిలో ఈత కొట్టడానికి వెళ్లగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఈ ఘటనపై మృతుని తల్లి కాంపెల్లి మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ఈత రాని వారు బావులు, చెరువులు వంటి నీటి వనరుల్లోకి వెళ్లకుండా ఉండాలని పోలీసులు సూచించారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు



జగిత్యాల, ఏప్రిల్ 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.ఎస్. లత మాట్లాడుతూ వాసవీ మాత జయంతి సందర్భంగా ధర్మం, అహింస, సమానత్వం వంటి మహోన్నత విలువలను ప్రపంచానికి తెలియజేసిన వాసవీ మాత ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. వాసవీ మాత చూపించిన సత్య మార్గంలో నడుస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించాలని కోరారు. ప్రతి ఏటా వైశాఖ శుక్ల పక్ష దశమి రోజున వాసవీ మాత జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తి శ్రద్ధలతో వాసవీ మాత ఉత్సవాలను నిర్వహిస్తూ ధర్మం, నీతి, సేవాభావం వంటి విలువలను మన జీవితాల్లో ఆచరిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి రవికుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సంఘ ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాసవి మాత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 26 (ఈవార్తలు): శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి సందర్భంగా జగిత్యాల పట్టణంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయం నుండి వాసవి మాత ఆలయానికి వాసవి కన్యకా పరమేశ్వరి మాతను పల్లకిలో తీసుకువచ్చే కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఆయన స్వయంగా పల్లకిని మోసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవి మాత జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. మన ధర్మాన్ని మనం ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వైశ్య సంఘం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయడం జరిగిందని, అలాగే పట్టణంలో అన్ని కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వాసవి మాత కటాక్షంతో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, వైశ్య సంఘం అధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి బోడ్ల జగదీష్, కోశాధికారి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ రాజేందర్, ఏఎంసీ డైరెక్టర్ రమేష్, అరవింద్, సంతోష్, సునీల్, వైశ్య సంఘం సభ్యులు, వాసవి మాత భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి గింజ కొంటాం

### రైతులు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు

**రైతులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపు**

**పలు చోట్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం**

చొప్పదండి, ఏప్రిల్ 26 (ఈవార్తలు): ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల సూచించారు. గంగాధర మండలంలోని హిమ్మత్ నగర్, రంగారావుపల్లి, ఉప్పరమల్యాల, కురిక్యాల, మధురానగర్, గంగాధర బూరుగుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని కేంద్రాలకు తీసుకువచ్చిన వరి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురికావద్దని పేర్కొన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి, వారి బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంబటి రజిత , ఎంపీడీవో రాము,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సింగల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచ్లు బీర్ల ఆనందం, దాసరి శంకరయ్య, రెండ్ల శ్రీనివాస్,కడారి రేణుక కనకయ్య, వేముల భాస్కర్, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, సాగి అజయ్ రావు, మేర్గ కొండయ్య, కర్ర బాపు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ గాయత్రీ పాలాట్ కు యుద్ధవీర్ స్మారక పురస్కారం



హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఈవార్తలు): యుద్ధవీర్ ఫౌండేషన్ 33వ స్మారక పురస్కారం కోసం డాక్టర్ గాయత్రీ పాలాట్‌ను ఎంపిక చేశారు. పాలియేటివ్ కేర్ రంగంలో ఆమె చేసిన విశిష్ట సేవలు, మానవ బాధలను తగ్గించడంలో ఆమె చూపిన అసాధారణ నిబద్ధతకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నారు. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఈ నెల 30న హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్‌లో ఉన్న కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియం లో ఈ అవార్డును అందజేస్తారు. ఈ పురస్కారం కింద ఒక ప్రశంసా పత్రం, ఒక లక్ష రూపాయల నగదు బహుమతి ఉంటాయి. కేరళలో జన్మించిన డాక్టర్ గాయత్రీ పాలాట్‌ది సైనిక కుటుంబం. దానితో ఆమె దేశంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగారు. ఆమె మన దేశంలో చదువుకుని అనస్థీషియాలజీ డిప్లొమా, డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ పొందారు. అలాగే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్ డియాగో నుండి ఇంటర్నేషనల్ ప్యాలియేటివ్ కేర్ లీడర్‌షిప్‌లో డిప్లొమా పొందారు. కొచ్చిలోని అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పాలియేటివ్ మెడిసిన్ విభాగం, దేశంలో మొదటిసారిగా ప్రారంభమైన పాలియేటివ్ మెడిసిన్ డిప్లొమా అభివృద్ధిలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఆమె 2006లో మెహదీ నవాజ్ జంగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్, హైదరాబాద్ కి పెయిన్, పాలియేటివ్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా వచ్చారు. అక్కడ పాలియేటివ్ మెడిసిన్ విభాగం స్థాపనలో మరియు రాష్ట్ర ఆరోగ్య విధానంలో పాలియేటివ్ కేర్ ను చేర్చడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. 2019లో నిలోఫర్ ఆసుపత్రిలో పీడియాట్రిక్ పాలియేటివ్ కేర్ విభాగాన్ని స్థాపించడంలో, 2017 నుంచి 2022 వరకు తెలంగాణ లోని 33 జిల్లాల్లో పాలియేటివ్ కేర్ విభాగాలను ఏర్పాటు చేయడంలో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. అలాగే తెలంగాణలో ఓపియాయిడ్ నియంత్రణ సంస్కరణలను ప్రోత్సహించడం ద్వారా విధాన రూపకల్పన, సేవల ప్రాప్తి విస్తరణలో ఆమె కీలక పాత్ర పోషించారు. దీనితో పాటు 2021లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా ఎంఎన్‌జే లో మూడు సంవత్సరాల ఎండీ, డీఎన్ బీ పాలియేటివ్ మెడిసిన్ ప్రోగ్రామ్‌లకు గుర్తింపు సాధించడంలో ఆమె ముఖ్య పాత్ర పోషించారు.

# నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి: అడ్లూరి




చండీగఢ్: విద్య, నైపుణ్యాభివృద్ధి ద్వారా బలహీన వర్గాలకు ఉపాధి అవకాశాలను విస్తరించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హర్యానా రాష్ట్రం చండీగఢ్‌లో నిర్వహించిన "చింతన్ శివిర్" సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల సమర్థ అమలు, బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణతో పాటు ఉత్తర ప్రదేశ్, నాగాలాండ్, ఒడిశా, మేఘాలయ, అస్సాం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, ఉపసంచాలకులు పాల్గొన్నారు. సదస్సులో మంత్రి లక్ష్మణ్ కుమార్ పలు కీలక సూచనలు చేశారు. సామాజిక న్యాయ రంగంలో కేంద్ర-రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాలని సూచించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించి బలహీన వర్గాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వాలు కృషి చేయాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగవంతం కోసం డిజిటల్ విధానాలను విస్తృతంగా వినియోగించాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న వినూత్న సంక్షేమ కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ "చింతన్ శివిర్" రాష్ట్రాల మధ్య ఉత్తమ విధానాల మార్పిడి, సమన్వయానికి ఉపయోగకర వేదికగా నిలిచిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

## జనగణనలో ప్రజలు చురుకుగా పాల్గొనాలి: ఏసీ

జగిత్యాల, ఏప్రిల్ 26 (ఈవార్తలు): భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న జనగణన-2027 కార్యక్రమంలో జిల్లా ప్రజలు చురుకుగా పాల్గొనాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలిసారిగా స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్--ఎస్ఈ) సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ విధానంలో ప్రతి కుటుంబం తమ గృహానికి సంబంధించిన వివరాలను స్వయంగా ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. ఇది సులభమైన, సురక్షితమైన మరియు పారదర్శకమైన విధానమని పేర్కొంటూ, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని జనగణన ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

## ఏపీకి వడగాడ్పుల భయం

విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఈవార్తలు): అమరావతి: రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే హడలిపోపోతున్నారు జనాలు. ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కీలక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సోమవారం ఎండల తీవ్రత అధికంగా ఉండనుందని తెలిపారు. 23 మండలాల్లో తీవ్రమైన ఎండలు, 26 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ప్రకటించారు. వడగాడ్పులు, ఎండ తీవ్రత అధికంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## యూరప్ టూర్‌కు జగన్

**ట్రెండీ లుక్‌తో సోషల్ మీడియాలో వైరల్**

తాడేపల్లి, ఏప్రిల్ 26 (ఈవార్తలు): వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి యూరప్ పర్యటనకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన సరికొత్త డ్రెస్సింగ్ స్టైల్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన కొత్త లుక్‌కి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అర్ధరాత్రి బెంగళూరు విమానాశ్రయం నుంచి ఆయన కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లారు. యూరప్‌లోని పలు దేశాల్లో పర్యటించేందుకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల ప్రకారం మే 15వ తేదీ వరకు ఆయన యూరప్‌లోనే గడపనున్నారు. వాస్తవానికి ఈనెల 20నే ఈ పర్యటన మొదలుకావాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల ఐదు రోజులు ఆలస్యమైంది. ఈ పర్యటనలో జగన్ డ్రెస్సింగ్ స్టైల్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రాజకీయ కార్యక్రమాల్లో సాధారణంగా తెల్లటి చొక్కా, ఫార్మల్ ప్యాంటు, సాధారణ చెప్పులతో కనిపించే జగన్.. ఈసారి అందుకు భిన్నంగా ట్రెండీ లుక్‌లో దర్శనమిచ్చారు. బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఆయన బ్లూ డెనిమ్ షర్ట్, బ్లూ జీన్స్ ప్యాంట్, షూస్ ధరించి కనిపించారు. ఎయిర్‌పోర్టులో జగన్‌ను ఈ కొత్త లుక్‌లో చూసిన ప్రయాణికులు, అభిమానులు ఆశ్చర్యపోయారు. ఆయనతో ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. ప్రస్తుతం ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి.

## పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు ఉండొద్దు

**పెట్రో కంపెనీలకు చంద్రబాబు ఆదేశాలు**

అమరావతి, ఏప్రిల్ 26 (ఈవార్తలు): సోమవారం నుంచి ఏపీలో ఎక్కడా పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపించడానికి వీల్లేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయిల్ కంపెనీలకు స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా ప్రజలను, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తే కంపెనీల అనుమతులపై పునరాలోచన చేయాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరతపై ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నిత్యావసరాలైన పెట్రోల్, డీజిల్ సరఫరాలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని సీఎం తేల్చి చెప్పారు. రిటైల్ ఔట్‌లెట్లకు క్రెడిట్ నిలిపివేసి, సరఫరా ఆపడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నయారా, రిలయన్స్ వంటి ప్రైవేట్ ఆపరేటర్లు సరఫరా నిలిపివేయడంతో సమస్య తీవ్రమైందని అధికారులు సీఎంకు వివరించారు. దీనికి తోడు వరికోతలు, అగ్రి, ఆక్వా రంగాల నుంచి డీజిల్‌కు డిమాండ్ పెరగడం కూడా కొరతకు కారణమైంది. మూడు రోజుల క్రితమే సమస్యను గుర్తించినా ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేదని కంపెనీల ప్రతినిధులను సీఎం ప్రశ్నించారు. నివేదికలు కాదు, ఫలితాలు చూపించాలని ఆదేశించారు. ఈ సమస్యను తక్షణం చక్కదిద్దేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బ్లాక్ మార్కెట్ అమ్మకాలు జరగకూడదని, రైతులకు ఇబ్బంది లేకుండా కూపన్ విధానంపై ఆలోచించాలని అధికారులకు సూచించారు. సరఫరాను వెంటనే సాధారణ స్థితికి తీసుకురావాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని చంద్రబాబు మరోసారి హెచ్చరించారు.

## శేషాచలం అడవుల్లో భారీ అగ్నిప్రమాదం

తిరుపతి, ఏప్రిల్ 26 (ఈవార్తలు): పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి పరిసరాల్లోని శేషాచలం అటవీ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శ్రీవేంకటేశ్వర వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలోని జీవకోన సమీపంలో అడవి ఒక్కసారిగా అంటుకోవడంతో సుమారు 2 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం కాలి బూడిదైంది. జీవకోన సమీపంలోని మొండోడికోన నుంచి తిమ్మినాయుడుకోన వరకు మంటలు వేగంగా వ్యాపించాయి. విలువైన వనమూలికలు, భారీగా వృక్షాలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటల ధాటికి వన్యప్రాణులు భయంతో పరుగులు తీశాయి. సమాచారం అందుకున్న వెంటనే అటవీ శాఖ సిబ్బంది, అగ్నిమాపక దళం, స్థానికులు రంగంలోకి దిగి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అటవీ ప్రాంతం, కొండ ప్రాంతం కావడంతో ఫైర్ ఇంజన్లు వెళ్లడానికి సరైన దారి లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి వేగంగా వీస్తుండటంతో మంటలు పక్కనే ఉన్న గుట్టలకు వ్యాపిస్తున్నాయని, వీటిని పూర్తిగా ఆర్పడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు ధృవీకరించారు. అయితే, అటవీ సంపదకు మాత్రం భారీ నష్టం వాటిల్లింది. ఎండల తీవ్రత పెరగడం వల్ల ఎండుటాకులు రాపిడికి గురై మంటలు చెలరేగి ఉండవచ్చని లేదా ఎవరైనా ఆకతాయిలు నిప్పు పెట్టారా అనే కోణంలో అటవీ శాఖ విచారణ చేపడుతోంది. ఎర్రచందనం నిల్వలు ఉన్న ప్రాంతం కావడంతో నిఘా పెంచామని, గిడ్డంగులకు ముప్పు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని అధికారులు వెల్లడించారు.



## అలకనంద నదిలో

# హైదరాబాదీ గల్లంతు

డెహ్రాడూన్: ఉన్నత చదువుల కోసం ఉత్తరాఖండ్ వెళ్లిన ఒక హైదరాబాద్ విద్యార్థి ప్రమాదవశాత్తూ అలకనంద నదిలో గల్లంతయ్యాడు. ఎన్ఐటీ ఉత్తరాఖండ్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఆనంద్ మోహన్, ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి నది వద్దకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం సంభవించినట్టు సమాచారం. ఉత్తరాఖండ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్ మోహన్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి అలకనంద నది తీరానికి వెళ్లాడు. సరదాగా గడిపే క్రమంలో, నది ఒడ్డున ఉన్న ఒక ఎత్తైన ప్రదేశం నుండి ఆనంద్ నీటిలోకి దూకగా.. ఎంతసేపటికీ నీటిపైకి రాకపోవడంతో ఆందోళన చెందిన స్నేహితులు వెంటనే స్థానిక పోలీసులకు, కళాశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాత్రి వరకు గాలింపు చేపట్టినప్పటికీ ఆనంద్ ఆచూకీ లభించలేదు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం, వెలుతురు లేకపోవడంతో గాలింపును నిలిపివేసారు. హైదరాబాద్ లో ఉంటున్న ఆనంద్ మోహన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కాగా ఉన్నత చదువులు చదివి గొప్పవాడవుతాడనుకున్న తమ కుమారుని మిస్సింగ్ వార్త విని మోహన్ పేరెంట్స్ దిగ్భ్రాంతి చెందారు.

# రెబల్ ఎంపీలపై వేటు వేయండి

**రాజ్యసభ చైర్మన్‌కు ఆప్ విజ్ఞప్తి**

న్యూఢిల్లీ: తమ పార్టీని వీడి బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలపై అనర్హత వేటు వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ చైర్మన్‌ను కోరింది. ఈ మేరకు ఆయనకు పిటిషన్ సమర్పించినట్టు ఆదివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. ఆ ఏడుగురు ఎంపీలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించారని ఆరోపిస్తూ.. అవసరమైతే వారిపై న్యాయపరమైన చర్యలు చేపడతామని ఆయన ప్రకటించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ని ఉదహరిస్తూ ఈ తరహా రాజకీయ ఫిరాయింపులు ఉపేక్షించబడవని.. సుప్రీం కోర్ట్ తీర్పుల ప్రకారం ఈ తరహా ఫిరాయింపులు అనర్హతకు దారి తీస్తాయని తెలిపారు. పంజాబ్‌లోని కొందరు ఆప్ ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారన్న వార్తలను సింగ్ ఖండించారు. కేజ్రీవాల్ ప్రస్తుతం ఉంటున్న ఇంటిని 'శీష్ మహల్ 2'గా ప్రచారం చేస్తూ.. దాని సుందరీకరణకు ప్రైవేట్ డబ్బును ఖర్చు పెట్టారన్న తప్పుడు వార్తలను ప్రసారం చేసిన చానళ్లపై పరువు నష్టం దావా వేస్తామని చెప్పారు.

# దిగ్గజ ఫొటో జర్నలిస్ట్ రఘు రాయ్ కన్నుమూత

న్యూఢిల్లీ : ఎదుగుతున్న భారత్‌ను, భారతీయులను 1970వ దశకం నుంచి తన కెమెరాలో బంధించిన దిగ్గజ ఫొటో జర్నలిస్ట్ రఘు రాయ్ (83) ఆదివారం కన్నుమూశారు. ప్రొస్టేట్ క్యాన్సర్ మెదడుకు వ్యాపించడం, వృద్ధాప్య సమస్యల కారణంగా ఆయన ఢిల్లీలోని ఓ దవాఖానలో తుది శ్వాస విడిచారు. తన 23వ ఏట స్టేట్స్ వార్తాపత్రికలో చీఫ్ ఫొటోగ్రాఫర్‌గా ఆయన పాత్రికేయ జీవితం ప్రారంభించారు. ఆధునిక భారత్‌లో బంగ్లాదేశ్ యుద్ధం, ఆ దేశ కాందిశీకుల సమస్య(1977), భోపాల్ గ్యాస్ విషాదం(1984) లాంటి కీలక ఘట్టాలను, వారణాసి ఆధ్యాత్మిక వైభవాన్ని ఆయన తన కెమెరాలో బంధించారు. భారతావని సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక కోణాలను తన లెన్స్ ద్వారా ఫొటోలు తీశారు. ప్రముఖులు మొదలుకొని సామాన్యుల వరకు అందరికీ తన ఫొటోల్లో సమాన ప్రాధ్యాన్యాన్ని ఆయన ఇచ్చారు. 'మనం జీవిస్తున్న కాలాన్ని బంధించడానికి' ఫొటోగ్రఫీ అవసరమని ఆయన నమ్మేవారు.



# ఇరాన్ దెబ్బకు అమెరికా విలవిల

**ఇరాన్ దాడులతో అమెరికా సైనిక స్థావరాలకు తీవ్ర నష్టం.. మరమ్మతులకే బిలియన్ల డాలర్లు ఖర్చవుతుందని అంచనా**

**నష్టం వివరాలు చెప్పడం లేదని పెంటగాన్‌పై రిపబ్లికన్ల ఆగ్రహం**

**అమెరికా రక్షణ వ్యవస్థలను ఛేదించిన ఇరాన్ పాత ఫైటర్ జెట్**

**సౌదీ అరేబియాలో అమెరికా నిఘా విమానం ధ్వంసం**

టెహ్రాన్: అమెరికాతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ జరిపిన దాడుల వల్ల మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలకు ఊహించిన దానికంటే చాలా ఎక్కువ నష్టం వాటిల్లినట్లు అమెరికా అధికారులే అంగీకరిస్తున్నారు. ఈ నష్టం విలువ బిలియన్ల డాలర్లలో ఉంటుందని, మరమ్మతులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని ఎన్‌బీసీ న్యూస్ తన కథనంలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ దళాలు ఏడు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడుల్లో కమాండ్ సెంటర్లు, విమాన హ్యాంగర్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, రన్‌వేలు, రాడార్లతో పాటు కొన్ని విమానాలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికాకు చెందిన అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదించుకుని, ఇరాన్‌కు చెందిన పాతతరం ఎఫ్-5 ఫైటర్ జెట్ కూడా దాడి చేయగలగడం అమెరికా సైనిక వర్గాలను ఆశ్చర్యపరిచింది. సౌదీ అరేబియాలోని ఒక ఎయిర్ బేస్ పై దాడిలో అమెరికా నిఘా విమానం (అవాక్స్) ధ్వంసమైన చిత్రాలు కూడా వెలుగులోకి వచ్చాయి. అయితే, జరిగిన నష్టంపై పూర్తి వివరాలు వెల్లడించడానికి అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) నిరాకరిస్తోంది. ఈ వైఖరిపై రిపబ్లికన్ పార్టీ చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారాల తరబడి అడుగుతున్నా సమాచారం ఇవ్వడం లేదని, రికార్డు స్థాయి బడ్జెట్ కోరుతున్న సమయంలో పెంటగాన్ ఇలా వ్యవహరించడం సరికాదని వారు విమర్శిస్తున్నారు. ఇప్పటికే యుద్ధం కోసం ట్రంప్ ప్రభుత్వం కాంగ్రెస్‌ను 200 బిలియన్ డాలర్లు కోరింది. యుద్ధం మొదలైన మొదటి వారంలోనే అమెరికా 11 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు సమాచారం.

## వైట్‌హౌస్‌లో వైన్ బాటిళ్లు

# ఎత్తుకెళ్లిన 'అతిథులు'

వాషింగ్టన్: వాషింగ్టన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల కలకలం రేగగా, మరోవైపు కొందరు చేసిన పని తీవ్ర వివాదాస్పదమైంది. ప్రాణభయంతో పరుగులు తీయాల్సిన సమయంలో, కొందరు టేబుళ్లపై ఉన్న ఖరీదైన వైన్ బాటిళ్లను చేతుల్లో పట్టుకుని బయటకు వెళ్లడం కెమెరాల్లో రికార్డయింది. ఈ వీడియోలు వైరల్ కావడంతో జర్నలిస్టుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం రాత్రి వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో ఈ వార్షిక విందు జరిగింది. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రథమ మహిళ, ఉన్నతాధికారులు, జర్నలిస్టులు, ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతుండగా బాల్‌రూమ్ సమీపంలో ఒక్కసారిగా కాల్పుల శబ్దం వినిపించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రంప్ దంపతులను అక్కడి నుంచి సురక్షితంగా తరలించారు. అతిథులంతా భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ గందరగోళం మధ్యే కొందరు అతిథులు, టేబుళ్లపై ఉన్న వైన్, షాంపేన్ బాటిళ్లను తీసుకుని వెళుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై నెటిజన్లు తీవ్రంగా మండిపడ్డారు. "విపత్తులో అవకాశాన్ని వెతుక్కున్నారు" అంటూ విమర్శలు గుప్పించారు. ఈ వివాదానికి 'వైన్-గేట్' అని పేరు పెట్టారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని కాలిఫోర్నియాకు చెందిన కోల్ థామస్ అలెన్ (31)గా పోలీసులు గుర్తించారు. అతని వద్ద షాట్‌గన్, హ్యాండ్‌గన్‌తో పాటు పలు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ట్రంప్ వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనలో సీక్రెట్ సర్వీస్ అధికారి ఒకరికి బుల్లెట్ తగిలినప్పటికీ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ఉండడంతో అతనికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. నిందితుడిపై ఫెడరల్ చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ట్రంప్‌పై కాల్పుల నిందితుడు

# చదువుకున్నోడే.. కానీ!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న వైట్‌హైస్ కరస్పాండెంట్స్ డిన్నర్ మీట్‌లో కాల్పులకు పాల్పడిన నిందితుడు ఒక ఉన్నత విద్యావంతుడిగా వెల్లడైంది. అతడిని దర్యాప్తు బృందాలు 31 ఏళ్ల కోలో టామోస్ అలెన్గా గుర్తించాయి. కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెలెస్ శివార్లలో ఉన్న టోరెన్స్ ప్రాంత వాసిగా గుర్తించారు. అతడి లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 2017లో మెకానికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేశాడు. థామస్ అలెన్ 2017లో కాల్టెక్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడే వీల్‌ఛైర్స్‌కు ఎమర్జెన్సీ బ్రేక్‌ను ప్రయోగాత్మకంగా రూపొందించాడు. ఈ అంశం గురించి స్థానిక పత్రికలో కథనం కూడా వెలువడింది. ఆ తర్వాత కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తిశాడు. 2018లో ఓ వీడియోగేమ్‌ను కూడా తయారు చేసి ట్రేడ్‌మార్క్ కోసం రిజిస్టర్ చేసుకొన్నాడు. ఇటీవల 'ఫస్టలా ' పేరిట మరో గేమ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు లింక్డిన్‌లో వెల్లడించాడు. 2014లో జెట్ ప్రొపెల్షన్ ల్యాబ్‌లో నాసా నిర్వహించిన ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లో కూడా అతడు పాల్గొన్నాడు. ప్రస్తుతం టెస్ట్ ప్రిపరేషన్ ట్యూటరింగ్ కంపెనీ సీ2 ఎడ్యూకేషన్‌లో టీచర్‌గా పనిచేస్తున్నట్లు ప్రొఫైల్‌లో ఉంది. డిసెంబర్ 2024లో టీచర్ ఆఫ్ ది మంత్‌గా కూడా ఎంపికయ్యాడు. ఇక రాజకీయ నేపథ్యం చూస్తే.. డెమోక్రటిక్ పార్టీకి సానుభూతిపరుడిగా తెలుస్తోంది. కమలా హ్యారిస్ అధ్యక్ష ప్రచారానికి 25 డాలర్లు విరాళం కూడా ఇచ్చినట్లు ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ రికార్డులు చెబుతున్నాయి.



# అంబానీ ఇంట్లో రిహానా

**సందడి చేసిన పాప్ సింగర్**

**భారతీయ సంస్కృతికి ఫిదా**

**'ఫెంటి బ్యూటీ' బ్రాండ్ ప్రమోషన్**

ముంబై: ప్రముఖ పాప్ సింగర్, గ్లోబల్ ఐకాన్ రిహానా ముంబైలోని అంబానీ నివాసంలో సందడి చేశారు. అంబానీ కుటుంబసభ్యులు ఆమెకు ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చి, మధ్యాహ్న విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతీయ కళ, సంస్కృతి, నృత్య రూపాల గురించి రిహానా ఆసక్తిగా తెలుసుకున్నారు. అనంత్ అంబానీ, రాధికా మర్చంట్, ఈషా అంబానీ, శ్లోకా మెహతా తదితరులు రిహానాకు సాదర స్వాగతం పలికారు. వారితో కలిసి రిహానా భోజనం చేస్తూ



సరదాగా ముచ్చటించారు. ఈ విందు కార్యక్రమం కుటుంబసభ్యుల మధ్య అత్యంత ఆత్మీయంగా జరిగింది. రిలయన్స్ రిటైల్ సంస్థ తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ 'ఫెంటి బ్యూటీ' వేడుకల కోసం రిహానాను భారత్‌కు తీసుకువచ్చింది. ఈ బ్రాండ్ ఉత్పత్తులు భారత్‌లో ప్రత్యేకంగా 'టిరా', 'సెఫోరా' స్టోర్లలో అందుబాటులో ఉన్నాయి. ఈ బిజినెస్ టూర్ లో భాగంగానే ఆమె అంబానీ కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుస్తోంది. రిహానా గతంలో అనంత్ అంబానీ ప్రీ వెడ్డింగ్ వేడుకల్లోనూ సందడి చేశారు.



ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
సోమవారం 27-4-2026, జగిత్యాల | www.evarthalu.com | 6

వయ్యారి చిత్రం






## పెద్దికి గ్లామర్ టచ్



సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది అన్నప్పుడు ఫ్యాన్స్ అందరూ రిలీజ్ డేట్ కోసం వెతుకుతుంటారు. కానీ రామ్ చరణ్ 'పెద్ది' టీమ్ మాత్రం సైలెంట్ గా ఒక బాంబు పేల్చింది. అంతా అయిపోయింది అనుకుంటున్న టైమ్ లో సడన్ గా సెట్ లోకి ఒక స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇవ్వడం ఇప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. బుచ్చిబాబు సానా ఈ సినిమాను కేవలం ఒక స్పోర్ట్స్ డ్రామాగా మాత్రమే కాకుండా, బాక్సాఫీస్ దగ్గర క్లిక్కయ్యేలా ఒక పక్కా కమర్షియల్ ప్యాకేజీలా మార్చే పనిలో పడ్డారు. అందుకే షూటింగ్ ఆఖరి అడుగులో ఒక క్రేజీ స్పెషల్ సాంగ్ ను యాడ్ చేశారు. పెద్ది సినిమాలో స్పెషల్ సాంగ్ కోసం శృతి హాసన్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో ఈ రోజు నుంచే హైదరాబాద్ లో షూటింగ్ మొదలైనట్లు సమాచారం. ఒక నాలుగు రోజుల పాటు జరిగే ఈ షూట్ తో 'పెద్ది' మొత్తం షూటింగ్ పార్ట్ క్లోజ్ అవుతుంది. మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే లాంటి పేర్లు వినిపించినా, చివరికి శృతి హాసన్ ను ఎంచుకోవడం వెనుక ఒక పెద్ద స్ట్రాటజీనే ఉంది. ఆమెకున్న నేషనల్ వైడ్ గుర్తింపు సినిమా బిజినెస్ కు, ముఖ్యంగా నార్త్ మార్కెట్ కు పెద్ద ప్లస్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. 'గేమ్ ఛేంజర్' రిజల్ట్ తర్వాత చరణ్ తన పాన్ ఇండియా మార్కెట్ ను మళ్ళీ నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. 'పెద్ది' ప్యూర్ రూరల్ నేటివిటీ ఉన్న సినిమా కాబట్టి, దీన్ని హిందీ ఆడియన్స్ కు సెల్ చేయాలంటే ఒక అదిరిపోయే మాస్ సాంగ్ ఉండాల్సిందే. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ కి శృతి హాసన్ గ్లామర్ తోడైతే, ఆ పాట ఇచ్చే బజ్ తోనే సినిమా సగం సక్సెస్ అవుతుందని టీమ్ నమ్మకంగా ఉంది. ప్రమోషన్లకు ఈ పాటను ఒక లాంచ్ ప్యాడ్ లా వాడుకోబోతున్నారు.



## మైఖేల్.. 2 వేల కోట్ల ఓపెనింగ్స్

పాప్ ఇండస్ట్రీలో తిరుగు లేని మహారాజు ఎవరంటే మైఖేల్ జాక్సన్ అనే చెబుతారు అంతా. అందుకే పాప్ రంగంలో కింగ్ ఆఫ్ పాప్ గా పిలవబడే తన జీవిత చరిత్రపై వచ్చిన తాజా చిత్రం ఇప్పుడు సంచలనం సెట్ చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఏప్రిల్ 24న విడుదల అయ్యిన ఈ సినిమా భారీ ఓపెనింగ్స్ సాధించి రికార్డులు బద్దలుగొట్టినట్టు హాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మైఖేల్ ప్రపంచ వ్యాప్తంగా 217.4 మిలియన్ డాలర్స్ గ్రాస్ అంటే 2 వేల కోట్లకి పైగా ఓపెనింగ్స్ ని ఈ చిత్రం అందుకొని దుమ్ము లేపింది. వరల్డ్ సినిమా దగ్గర ఒక బయోపిక్ కి ఇదే అత్యధిక ఓపెనింగ్ అట. దీనితో పాప్ రంగం లోనే కాకుండా బాక్సాఫీస్ దగ్గర కూడా మైఖేల్ జాక్సన్ కింగ్ అనే అనిపించుకున్నారని చెప్పవచ్చు. ఇది కేవలం ఆరంభం మాత్రమే కాగా ఫైనల్ రన్ లో ఈ సినిమా ఎక్కడ వరకు వెళ్లి ఆగుతుందో చూడాలి. అంతే కాకుండా సినిమాకి 155 మిలియన్ మేర బడ్జెట్ అయితే ఆ మొత్తం కేవలం ఒక్క రోజు లోనే రాబట్టేసింది ఈ చిత్రం. ఇక ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ గా జాఫర్ జాక్సన్ నటించగా ఆంటౌన్ ఫక్వా దర్శకత్వం వహించారు.

## రిస్క్‌లో కీర్తి సురేష్ కెరీర్

టాలీవుడ్ బ్యూటీ క్వీన్ కీర్తి సురేష్ మహానటి చిత్రంతో దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నది, కానీ ప్రస్తుతం తన కెరీర్‌లో ఒక కీలకమైన దశలో ఉన్నారు. ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోలందరి సరసన నటించిన ఈ భామకు, గత మూడేళ్లుగా ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. 'దసరా' తర్వాత మళ్ళీ ఆ రేంజ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న కీర్తి, ఇప్పుడు తన ఆశలన్నీ రాబోయే రెండు క్రేజీ ప్రాజెక్టులపైనే పెట్టుకున్నారు. కీర్తి సురేష్ ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్ధన' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఉన్నాయి. విజయ్ క్రేజ్, కీర్తి నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ రిపీట్ అవుతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కీర్తికి మళ్ళీ మునుపటి వైభవం రావాలంటే ఈ సినిమా కచ్చితంగా హిట్ అవ్వాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాజెక్టును ఆమె ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, తన పాత్ర కోసం చాలా కష్టపడుతున్నారని సమాచారం. మరోవైపు, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న మల్టీస్టారర్ సినిమాలో కీర్తి సురేష్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు టాక్ నడుస్తోంది. ఇందులో ఆమె సీనియర్ హీరో వెంకటేశ్‌కు జోడీగా నటించబోతున్నట్లు ఫిలిం నగర్ సమాచారం. ఇక అనిల్ రావిపూడి సినిమాలు కమర్షియల్‌గా మంచి సక్సెస్ సాధిస్తాయి కాబట్టి, ఈ మూవీ కీర్తి కెరీర్‌కు పెద్ద ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. వెంకటేశ్, కీర్తి సురేష్ జోడీ వెండితెరపై ఎలా ఉండబోతుందోనని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## రూ.1.20 లక్షల సిల్వర్ గౌనులో మలైకా

బాలీవుడ్ గ్లామర్ క్వీన్ మలైకా అరోరా లేటెస్ట్ లుక్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల జరిగిన 'గ్లోబల్ స్పా అవార్డ్స్ 2026' వేడుకలో మలైకా అరోరా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఆమె ధరించిన వెండి రంగు బాడీకాన్ గౌను అందరి దృష్టిని ఆకర్షించింది. సుమారు ఒక లక్షా ఇరవై వేల రూపాయల విలువైన ఈ మెటాలిక్ డ్రెస్, ఆమె బాడీ షేప్‌కు పర్ఫెక్ట్‌గా సరిపోయింది. డ్రెస్ అంతా అద్దాల పనితనం ఉండటంతో, లైట్ల వెలుతురులో మలైకా ఒక మెరిసే లోహపు విగ్రహంలా కనిపించింది. పాత కాలపు హాలీవుడ్ స్టైల్‌ను, ఇప్పటి ట్రెండ్‌ను కలిపి రూపొందించిన ఈ లుక్ అదిరిపోయిందనే చెప్పాలి. అంత ఖరీదైన డ్రెస్ వేసుకున్నప్పుడు సాధారణంగా నగలు ఎక్కువగా పెడతారు. కానీ మలైకా మాత్రం చాలా సింపుల్‌గా ప్లాన్ చేసింది. కేవలం పొడవైన కమ్మలు, మెటాలిక్ గాజులు మాత్రమే ధరించి తన లుక్‌ను హుందాగా మార్చేసింది. జుట్టును వదులుగా వదిలేసి, కళ్ళకు మరియు పెదవులకు మాత్రమే హైలైట్ అయ్యేలా తక్కువ మేకప్‌తో కనిపించింది.




## మే 8న ది కేరళ స్టోరీ 2 స్ట్రీమింగ్

'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ విడుదలపై తాజా అప్డేట్ వచ్చింది. ప్రముఖ వేదిక జీ5 మొదట ఈ చిత్రాన్ని మే 8న స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించింది. కానీ తాజాగా విడుదల తేదీని మార్చి, ఒక వారం ముందుకు జరిపింది. దీంతో ఇప్పుడు ఈ చిత్రం మే 1 నుంచే ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ నిర్ణయం సినిమాను ఓటీటీలో చూడాలని ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు గుడ్ న్యూస్‌గా మారింది. థియేటర్లలో మిస్సయినవారికి ఇది మంచి అవకాశం అని చెప్పవచ్చు. ఈ చిత్రంలో అదితి భార్య, ఉల్కా గుప్తా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించారు. సన్ షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై విపుల్ షా ఈ సినిమాను నిర్మించారు. థియేటర్లలో ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన 'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ వేదికపై ఎలాంటి స్పందన దక్కించుకుంటుందో చూడాలి.



## రియాకి ఊరట

బాలీవుడ్ సినిమా దగ్గర తన కొన్ని సినిమాలతోనే సత్తా చాటి చిన్న వయసులోనే మరణించిన టాలెంటెడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ కోసం తెలుగు ఆడియెన్స్ కి కూడా బాగానే తెలుసు. ఎం ఎస్ ధోని జీవిత చరిత్రని బయోపిక్ గా చేసిన ఈ యంగ్ హీరో 2020 కరోనా లాక్ డౌన్ సమయంలో అనుమానాస్పదంగా మరణించడం అందరినీ తీవ్రంగా కలచి వేసింది. అయితే తనది ఆత్మహత్యే అని సిబిఐ కోర్ట్ నివేధిక అందించింది కానీ అప్పట్లో తన గర్ల్ ఫ్రెండ్ ప్రముఖ హీరోయిన్ రెయా చక్రబోర్తి పేరు బాగా వినిపించింది. అయితే అప్పటి నుంచి ఆమె బ్యాంకు ఖాతా అలాగే ఆమె సోదరుడు బ్యాంకు ఖాతాలని ఎన్‌సీబీ (నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో) వారు ఫ్రీజ్ చేసేసారు. అయితే ఈ విషయంలో వారికి ఎన్ డీ పి సి కోర్ట్ వారు ఉపశమనం అందించారు. ఆమె బ్యాంక్ ఖాతాలను డీఫ్రీజ్ చేయాలని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ విషయంలో దర్యాప్తు సంస్థ తప్పనిసరిగా పాటించాల్సిన చట్టపరమైన విధివిధానాలను అనుసరించడంలో విఫలమైందని కోర్టు పేర్కొంది. ఇలా మొత్తానికి యువ హీరోయిన్ కి బిగ్ రిలీఫ్ దక్కింది.



నాలుగో టీ20లో భారత్‌దే గెలుపు

# సఫారీలను భయపెట్టిన దీప్తి

దక్షిణాఫ్రికా గడ్డపై పొట్టి సిరీస్‌లో భారత మహిళల జట్టు ఎట్టకేలకు బోణీ కొట్టింది. హ్యాట్రిక్ ఓటములతో ట్రోఫీ సమర్పించుకున్న టీమిండియా.. నాలుగో టీ20లో ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. దీప్తి శర్మ(36 నాటౌట్, 5-19) ఆల్‌రౌండ్ షోకు జెమీమా రోడ్రిగ్స్(43) కీలక ఇన్నింగ్స్ తోడవ్వగా సఫారీలపై 14 పరుగుల తేడాతో గెలుపొంది పరువు కాపాడుకుంది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన వైట్‌వాష్ తప్పించుకుంది. పొట్టి ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో భారత మహిళల జట్టు తొలి విజయంతో మురిసింది. దక్షిణాఫ్రికా గడ్డపై పొట్టి సిరీస్ కోల్పోయిన టీమిండియా ది వాండరర్స్ స్టేడియంలో పంజా విసిరింది. తొలుత జెమీమా రోడ్రిగ్స్(43), దీప్తి శర్మ(36 నాటౌట్), రీచా ఘోష్(34 నాటౌట్)ల మెరుపులతో భారీ స్కోర్ కొట్టిన టీమిండియా.. అనంతరం దక్షిణాఫ్రికాను 171కే కట్టడి చేసింది. బ్యాటుతో రాణించిన దీప్తి బంతితోనూ చెలరేగుతూ ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది. ఫామ్‌లో ఉన్న లారా వొల్వార్ట్(18)ను ఔట్ చేసి క్రాంతి గౌడ్ బ్రేకివ్వగా.. దీప్తి శర్మ తిప్పేయడంతో సఫారీ మిడిలార్డర్ పెవిలియన్ బాట పట్టింది. తంజిబ్ బ్రిట్స్(30) దూకుడుకు చరణి చెక్ పెట్టింది. డేంజరస్ సునే లుస్(40), అనెరీ డెర్క్‌సెన్(9), రెనెకే(21) అయబొగ ఖాకా(1), సెఖుఖునే(4)లను ఔట్ చేసిన దీప్తి తొలిసారి టీ20ల్లో ఐదు వికెట్లు పడగొట్టింది. దాంతో, 14 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ పరాజయాలకు ముగింపు పలికింది. ఇరుజట్ల మధ్య ఐదో మ్యాచ్ సోమవారం బెనోనిలోని విల్లోమూరె పార్క్‌లో జరుగనుంది.

# గుజరాత్‌దే గెలుపు

## సాయి సుదర్శన్ సూపర్ ఇన్నింగ్స్

చిత్తుగా ఓడిన చెన్నై.. ఘోరంగా బ్యాటర్ల విఫలం

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 7 | 6 | 1 | 12 |
| బెంగళూరు | 7 | 5 | 2 | 10 |
| హైదరాబాద్ | 8 | 5 | 3 | 10 |
| రాజస్థాన్ | 8 | 5 | 3 | 10 |
| గుజరాత్ | 8 | 4 | 4 | 8 |
| చెన్నై | 8 | 3 | 5 | 6 |
| ఢిల్లీ | 7 | 3 | 4 | 6 |
| కోల్‌కతా | 8 | 2 | 5 | 5 |
| ముంబై | 7 | 2 | 5 | 4 |
| లక్నో | 8 | 2 | 6 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు



ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ మళ్లీ విజయాల బాట పట్టింది. వరుసగా రెండు పరాజయాల తర్వాత మరో విజయాన్ని అందుకుంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో చెపాక్ మైదానం వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

**బౌలింగ్‌లో రబడా నిప్పులు చెలరేగగా.. బ్యాటింగ్‌లో లోకల్ భాయ్ సాయి సుదర్శన్ చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్(60 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 74 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.**

గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో కగిసో రబడా(3/25)మూడు వికెట్లు తీయగా.. అర్షద్ ఖాన్(2/43) రెండు వికెట్లు పడగొట్టాడు. మానవ్ సుతార్, మహమ్మద్ సిరాజ్‌కు చెరో వికెట్ దక్కింది. అనంతరం గుజరాత్ టైటాన్స్ ఓవర్లలో 159 పరుగులు చేసి గెలుపొందింది. సాయి సుదర్శన్(46 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లతో 87) హాఫ్ సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(23 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 33), జోస్ బట్లర్(30 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 39 నాటౌట్)రాణించారు. నూర్ అహ్మద్, అకీల్ హుసేన్ చెరో వికెట్ తీసారు. గుజరాత్ టైటాన్స్‌కు ఇది నాలుగో విజయం కాగా.. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదో పరాజయం. గుజరాత్ టైటాన్స్ పేసర్ కగిసో రబాడ అద్భుతమైన బౌలింగ్‌తో సీఎస్‌కే పతనాన్ని శాసించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సీఎస్‌కేను పవర్ ప్లేలోనే దెబ్బతీసాడు. ఆచితూచి ఆడిన సంజూ శాంసన్(11)తో పాటు ఉర్విల్ పటేల్(4)లను ఒకే ఓవర్‌లో పెవిలియన్ చేర్చాడు. చివర్లో దూకుడుగా ఆడిన కార్తీక్ శర్మ(15)ను క్యాచ్ ఔట్ చేశాడు. దాంతో సీఎస్‌కే కోలుకోలేకపోయింది. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోవడం.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు దూకుడుగా ఆడకపోవడంతో సీఎస్‌కే భారీ లక్ష్యాన్ని నమోదు చేయలేకపోయింది. టార్గెట్ చిన్నది కావడంతో గుజరాత్ టైటాన్స్ ఆచితూచి ఆడి విజయాన్ని కైవసం చేసుకుంది.



# కోల్‌కతా సూపర్

**సూపర్ ఓవర్‌లో రహానేసేన గెలుపు**

**నిప్పులు చెరిగిన మొహ్సిన్ ఖాన్**

**అయినా లక్నోకు తప్పని ఓటమి**

ఐపీఎల్ 2026లో భాగంగా లక్నోతో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 'సూపర్' విజయం సాధించింది. సూపర్ ఓవర్‌లో లక్నో 3 బంతుల్లో రెండు వికెట్లు కోల్పోయి ఒక్క పరుగు మాత్రమే చేసింది. కోల్‌కతా తొలి బంతికే సూపర్ ఓవర్ లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. 156 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. ఇరు జట్ల స్కోర్‌లు సమం కావడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. లఖ్‌నవూ బ్యాటర్లలో రిషభ్ పంత్ (42; 38 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), మార్‌క్రమ్ (31; 27 బంతుల్లో), ఆయుష్ బదోని (24; 19 బంతుల్లో), షమి (11) పరుగులు చేశారు. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి లక్నో విజయానికి ఏడు పరుగులు అవసరం కాగా.. షమి సిక్స్ బాదడంతో మ్యాచ్ టై అయింది. తొలుత కోల్‌కతా బ్యాటర్లలో రింకు సింగ్ (83; 51 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. కామెరూన్ గ్రీన్ (34; 21 బంతుల్లో 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. రఘువంశీ (9), రమణ్‌దీప్ సింగ్ (6), రోవ్‌మన్ పావెల్ (1) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. టిమ్ సీఫర్ట్, అనుకుల్ రాయ్ డకౌటయ్యారు.

**రింకూ.. గ్రేట్ ఇన్నింగ్స్**

73 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన కేకేఆర్‌ను రింకూ తన వీరోచిత హాఫ్ సెంచరీతో ఆదుకున్నాడు. ఓ దశలో ఆచితూచి ఆడిన రింకూ.. చివరి రెండు ఓవర్లలో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మహ్మద్ షమీ వేసిన 19 ఓవర్‌లో 17 పరుగులు రాబట్టిన రింకూ సింగ్.. ఆ తర్వాత ఆఖరి ఓవర్‌లో స్పిన్నర్ దిగ్వేష్ రాఠీని ఓ ఆడుకున్నాడు. ఆ ఓవర్‌లో రింకూ వరుసగా నాలుగు సిక్స్‌లు బాది 26 పరుగులు పిండుకున్నాడు. మరో రెండు పరుగులు వైడ్స్ రూపంలో వచ్చాయి. కేవలం 51 బంతులు మాత్రమే ఎదుర్కొన్న రింకూ సింగ్.. 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 83 పరుగులు చేశాడు. అతడి విధ్వంసకర ఇన్నింగ్స్ ఫలితంగా కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. రింకూ సింగ్‌కు ఐపీఎల్‌లో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోర్ కావడం గమనార్హం. ఇక రింకూ సునామీకి ముందు లక్నో పేసర్ మొహ్సిన్ ఖాన్ నిప్పులు చెరిగాడు. తన పేస్ బౌలింగ్‌తో కేకేఆర్ టాపర్డర్‌ను మోహ్సిన్ కుప్పకూల్చాడు. మొహ్సిన్ తన నాలుగు ఓవర్లలో కేవలం 23 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతడితో లిండే ఓ వికెట్ సాధించారు. మహ్మద్ షమీతో సహా మిగితా బౌలర్లందా దారుణంగా విఫలమయ్యారు.

# వైభవ్ ఆట నచ్చింది

ఐపీఎల్లో రెండో శతకంతో రికార్డు నెలకొల్పిన వైభవ్ సూర్యవంశీకి అభిమానులు పెరిగిపోతున్నారు. తొలి బంతి నుంచే విరుచుకుపడే ఈ హిట్టర్ ఆటకు ఫిదా అవుతున్న దిగ్గజాలు 'వారెవ్వా .. ఏమన్న ఆడుతున్నాడా' అని ప్రశంసలు కురిపిస్తున్నారు. తన దూకుడైన ఆటతో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్ల మనసులు గెలుచుకుంటున్న వైభవ్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సైతం అభిమానిగా మారాడు. శనివారం జైపూర్ 36 బంతుల్లోనే శతకం బాదిన ఈ చిచ్చరపిడుగు ఆటపై కమిన్స్ ప్రశంసలు కురిపించాడు. పంతొమ్మిదో సీజన్‌లో విధ్వంసక ఆటతో ప్రపంచ స్థాయి బౌలర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న వైభవ్ సూర్యవంశీ రికార్డుల మోత మోగిస్తున్నాడు. దూకుడే మంత్రగా ఆడుతూ రాజస్థాన్ రాయల్స్‌కు మెరుపు ఆరంభాలిస్తున్న ఈ కుర్రాడి ఆటకు తాను వీరాభిమానిని అయ్యానంటున్నాడు కమిన్స్. జైపూర్‌లో వైభవ్ కళ్లారా చూసిన ప్యాటీ మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ నా కొత్త ఫేవరెట్ ప్లేయర్ వైభవ్ అని పేర్కొన్నాడు. 'వైభవ్ నా కొత్త ఫేవరెట్ క్రికెటర్. అతడు బంతిని బలంగా కొడుతున్నాడు. అతడి ఆట చూడడం చాలా అద్భుతంగా అనిపించింది. బౌలర్లు సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేయాలి. బౌలింగ్ లయ తప్పితే బంతి ఎక్కడికో వెళ్తుంది. వైభవ్ ఆట నన్ను ఆకట్టుకుంది. అతడు కెరీర్‌ను చాలా గొప్పగా మొదలెట్టాడు. వైభవ్ ఆడే విధానం నాకు చాలా నచ్చింది. అతడు మ్యాచ్‌ను చేతుల్లోంచి లాగేసుకుంటాడు' అని కమిన్స్ వైభవ్‌పై ప్రశంసలు కురిపించాడు.

# ధోనీ ఐపీఎల్ ఆడటం డౌటే

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా సీఎస్కే మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఎప్పుడు స్టేడియంలో అడుగుపెడతాడా అంటూ కోట్లాది మంది ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం.. ఎంఎస్ ధోనీ తన రీఎంట్రీపై జట్టు యాజమాన్యానికి కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. తాను పూర్తిగా ఫిట్‌నెస్ సాధించినప్పటికీ.. కేవలం తనను జట్టులోకి తీసుకోవడం కోసం ప్రస్తుతం బాగున్న జట్టు కాంబినేషన్‌ను పాడు చేయవద్దని ధోనీ జట్టు యాజమాన్యానికి స్పష్టం చేసినట్లు తెలిసింది. టీమ్ సమతుల్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే ధోనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత కొద్ది రోజులుగా ఎంఎస్ ధోనీ పిక్క గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లోనే ధోనీ బరిలోకి దిగుతాడని అందరూ భావించినప్పటికీ.. ధోనీ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఆ మ్యాచ్‌లో చెన్నై 103 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ మాట్లాడుతూ.. "ధోనీ బ్యాటింగ్ నైపుణ్యం గురించి మాకు సందేహం లేదు. కానీ వికెట్ల మధ్య ఆయన పిక్క గాయం ఇబ్బంది పెట్టకూడదు.

## చాయ్ తాగి సెలబ్రేట్ చేసుకుంటా: సాయి సుదర్శన్

తన హోమ్ గ్రౌండ్ చెపాక్ స్టేడియంలో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చడంపై గుజరాత్ టైటాన్స్ స్టార్ బ్యాటర్ సాయి సుదర్శన్ సంతోషం వ్యక్తం చేశాడు. ఈ ఇన్నింగ్స్ గురించి మాట్లాడేందుకు తన దగ్గర మాటల్లేవని చెప్పాడు. 'నిజం చెప్పాలంటే.. ఈ ఇన్నింగ్స్ పట్ల కృతజ్ఞతో ఉన్నాను. నా సొంత గడ్డపై మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ ఇన్నింగ్స్ గురించి చెప్పేందుకు నాకు మాటలు రావడం లేదు. కానీ అభిమానుల మద్దతు చూసి చాలా ఉద్వేగానికి లోనయ్యాను. నా హోమ్ గ్రౌండ్‌లో ఆడటం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. గత ఇన్నింగ్స్ నుంచి వచ్చిన ఆత్మవిశ్వాసాన్ని ఈ ఇన్నింగ్స్‌లో కూడా కొనసాగించాలని అనుకున్నాను. పరుగులు వస్తున్నాయా లేదా అనే దానికంటే, నేను ఏ విధంగా బ్యాటింగ్ చేస్తున్నాను అనే అంశానికే ప్రాధాన్యత ఇస్తున్నాను. ప్రతి మ్యాచ్‌ని కొత్త ఆరంభంగా చూస్తూ, ఆ ఆత్మవిశ్వాసాన్ని తదుపరి ఇన్నింగ్స్‌కు వాడుకుంటున్నాను. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ కాస్త సులువైంది. అయితే తొలి ఆరు ఓవర్లలో ఆడటం కష్టంగానే అనిపించింది. కానీ ఆ పవర్‌ప్లేలో మా ఆటగాళ్లు ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్ మమ్మల్ని మంచి స్థితిలో నిలబెట్టింది. నా బ్యాటింగ్ టెక్నిక్ విషయానికొస్తే.. బంతిని వీలైనంత ఆలస్యంగా ఆడటంపై నేను చాలా కసరత్తు చేస్తున్నా. ఆరంభ ఇన్నింగ్స్‌ల్లో నాకు సరైన రిథమ్ దొరకలేదు. కానీ ఒకసారి రిథమ్ వచ్చాక ఇప్పుడు అంతా సహజంగా జరుగుతోంది. ఇక నాకు ఇష్టమైన టీ షాప్‌కు వెళ్లి అక్కడ 'బన్ మస్కా'తింటూ.. 'చాయ్' తాగుతూ కొంత సమయం గడుపుతాను.'అని సాయి సుదర్శన్ చెప్పుకొచ్చాడు.



## పవర్ ప్లేనే మా కొంపముంచింది: గైక్వాడ్

పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోవడం తమ ఓటమిని శాసించిందని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. పిచ్‌ను అంచనా వేయడంలో తాము విఫలమయ్యామని తెలిపాడు. 'నిజం చెప్పాలంటే.. ఈ పిచ్‌ను అంచనా వేయడం చాలా కష్టమైంది. ముఖ్యంగా మీడియం పేసర్ల బౌలింగ్‌లో బంతి ఆగి వచ్చింది. అనూహ్య బౌన్స్ ఉంది. పవర్‌ప్లేలో వరుసగా వికెట్లు కోల్పోకుండా ఉంటే 170-180 పరుగులు చేసేవాళ్లం. గత మూడు మ్యాచ్‌లతో పోలిస్తే ఈ పిచ్ ప్రవర్తించిన తీరు చాలా భిన్నంగా ఉంది. మేం పరిస్థితులకు అలవాటు పడేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నేను దూకుడుగా ఆడాలని ప్రయత్నించాను. కానీ బంతి అనూహ్యమైన బౌన్స్‌తో వస్తుండటంతో ఇబ్బంది పడ్డాను. ప్రతి బంతికి శైలిని మార్చుకోవడం కష్టమైంది. ఫీల్డింగ్‌లో కూడా మేం కాస్త అలసత్వంగా ఉన్నాం. నా బ్యాటింగ్ విషయానికొస్తే.. మంచి ఆరంభం లభించినా వికెట్లు పడుతుండటంతో భాగస్వామ్యంపై దృష్టి పెట్టాను. స్ట్రైక్ రొటేట్ చేయడం కూడా కష్టమైంది. చివరి 5-6 ఓవర్లలో ఎలాగైనా వేగం పెంచాలని ప్రయత్నించాను. ఇంపాక్ట్ ప్లేయర్‌గా ముందుగా ముకేశ్ చౌదరిని ఆడించాలనుకున్నాం. కానీ పవర్‌ప్లేలోనే వికెట్లు కోల్పోవడంతో నాలుగో ఓవర్‌లోనే బ్యాటర్‌ను తీసుకోవాల్సి వచ్చింది. మా ప్రణాళిక సరిగ్గా ఉన్నా.. ఆశించిన ఫలితం దక్కలేదు. వీలైనంత త్వరగా ఈ ఓటమిని మర్చిపోయి తదుపరి మ్యాచ్‌పై దృష్టి పెడతాం.'అని రుతురాజ్ గైక్వాడ్ పేర్కొన్నాడు.

ఈవార్తలు

# ప్రజావాణి

www.evarthalu.com

నేటి ఈవార్తలు

సోమవారం 27-4-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# మధ్య తరగతికి సొంతిల్లు కలే

ప్రతి సామాన్యుడి జీవిత ఆశయం-ఒక సొంత గూడు. తరతరాలుగా భారతీయుల మానసిక స్థితిలో 'సొంతిల్లు' అనేది కేవలం ఒక ఆస్తి మాత్రమే కాదు, అది ఒక సామాజిక భద్రత, ఆత్మగౌరవం. కానీ, నేడు పెరుగుతున్న రియల్ ఎస్టేట్ ధరలు, ఆకాశాన్నంటుతున్న నిర్మాణ వ్యయం చూస్తుంటే, మధ్య తరగతి జీవికి ఆ కల ఒక అందని ద్రాక్షలా మారుతోంది. గత దశాబ్ద కాలంలో నగరాలు, పట్టణాల్లో భూముల ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. ఒకప్పుడు మధ్య తరగతికి అందుబాటులో ఉన్న శివారు ప్రాంతాలు సైతం ఇప్పుడు పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళిపోయాయి. సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరగడం సామాన్యుడి నడ్డి విరుస్తోంది. దీనికి తోడు పెరిగిన రిజిస్ట్రేషన్ ఫీజులు, పన్నులు వెరసి ఒక చిన్న ఫ్లాట్ కొనాలన్నా అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తక్కువ వడ్డీ రేట్లు, సులభతర గృహ రుణాలు అని బ్యాంకులు ఊరిస్తున్నా, వాస్తవంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఒక వేత జీవి తన నెలసరి సంపాదనలో సింహభాగాన్ని ఈఎంఐలకే వెచ్చించాల్సి వస్తోంది. రెండేళ్లుగా రెపో రేట్ల పెరుగుదల వల్ల రుణ గ్రహీతలపై వడ్డీ భారం మరింత పెరిగింది. ఫలితంగా, పిల్లల చదువులు, ఆరోగ్య అవసరాల కోసం దాచుకోవాల్సిన సొమ్ము బ్యాంకు ఖాతాల ద్వారా వడ్డీల రూపంలో కరిగిపోతోంది. ప్రభుత్వాలు 'అందరికీ ఇల్లు' వంటి పథకాలను ప్రకటిస్తున్నప్పటికీ, అవి క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో మధ్య తరగతికి చేరడం లేదు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాలు కొంత ఊరటనిచ్చినా, ఆదాయ పరిమితులు, ఇతర నిబంధనల వల్ల నిజమైన మధ్య తరగతి ప్రజలు వీటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టం అమలులోకి వచ్చాక పారదర్శకత పెరిగిన మాట వాస్తవమే అయినా, సామాన్యుడికి అందుబాటులో ఉండే 'అఫోర్డబుల్ హౌసింగ్' (సరసమైన గృహాలు) ప్రాజెక్టులు తగ్గిపోతున్నాయి. సొంతిల్లు అనేది ఒక బాధ్యతగా ఉండాలి కానీ భారం కాకూడదు. ప్రభుత్వం నిర్మాణ సామాగ్రిపై జీఎస్టీని తగ్గించడం, గృహ రుణాలపై వడ్డీ రాయితీలను పెంచడం వంటి చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో, అద్దె కొంపల్లోనే సగం జీవితం గడిపేస్తున్న మధ్య తరగతి జీవికి 'సొంతింటి స్వప్నం' కేవలం ఒక పీడకలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.



## అసంపూర్ణమైంది

ఇక్కడ ఒక నావ
ఆగిపోయింది
నెత్తుటి ప్రవాహాన్ని
దాటలేక పోయింది
జర జాగ్రత్త
నెమ్మదిగా నడవు !

నీ కళ్ళతోనే చూడు
వేరే వాళ్ళ కళ్ళతో చూడకు
నీ చూపుల భారం తెలిసిపోతుంది
ప్రయత్నం చెయ్యి
ఆగిపోకు!

మరణం బయపడి
జీవితంతో రాజీ పడింది
పాదాలను చూసి ఏడువకు
దారి పోడుగునా
అడుగులన్ని జ్ఞాపకాలే
మధురమైన మాటలు
ఆశల ఆశయాలు
వసంతానికి
లేలేత ఆకాశాన్ని చూపించు

దాని గురించి
రాహస్యం అవసరం లేదు
ఇప్పటికే
అందరికి తెలిసిపోయింది
ఇక్కడ స్వప్నం
నిరిజీవమై పడివుంది

ఎప్పుడైనా
పండుటాకులు రాలుతుండే
ఈసారి మాత్రం
పసరాకులు రాలుతున్నాయి
ఒకింత ప్రేమ
కనిపించకుండా పోయింది
సౌందర్యం
అసంపూర్ణమైంది
వాంఛ మృత్యువు
భుజాల మీద స్వారీ చేస్తుంది!!

-ఎదిరెపల్లి కాశన్న
18.4.2026

# ఆది కైలాసం




కోవెల సంతోష్ కుమార్,
రచయిత, 90521 16463





భూమ్మీద మొదటిసారి వినిపించిన శబ్దం ఏమిటో తెలుసా?
తొలి అక్షరం ఎలా పుట్టిందో తెలుసా?
ఈ ధ్వని ఎలా వినిపించింది?
ఎక్కడ వినిపించింది?
దాన్ని సృష్టించింది ఎవరు?

మనం పుట్టాం.. పెరిగాం.. మాట్లాడుతున్నాం.. కానీ మనం మాట్లాడుతున్న ఆ మాటకు సృష్టికర్త ఎవరు..? మరేదో కాదు. అది పరమేశ్వరుడి ధమరుకం.. ఆ ధమరుకం నుంచి వెలువడిన మొదటి ధ్వని ప్రణవం. ప్రణవ నాదాన్ని మహాశివుడు మోగించిన ప్రదేశం.. కైలాసాన్ని మరిపించిన మరో కైలాసం.. ఈశ్వరుడు జ్యోతి స్వరూపుడై ఆవిర్భవించిన మహాకైలాసం.. ఆది కైలాసం. ఆ నాదమూర్తి నుంచి విశ్వమంతా తరంగమైన ధ్వని ఓం.. ప్రణవనాదం ఓంకారాన్ని మనం ఆధ్యాత్మిక పరిభాషలో పిలుచుకునే మాట.. ఇది అన్ని మంత్రాలకూ మూల మంత్రం. అన్ని స్వరాలకు ఆది స్వరం. ఆది కైలాసంలో జనించిన మహాశబ్దం. మహామౌనాన్ని సైతం జయించిన విశ్వనాదం. మహేశ్వరుడి మహాసృష్టి. ఈశ్వర ధమరుకం నుంచి వెలువడిన ధ్వనితరంగం ఓం. విశ్వంలో తొలి కమ్యునికేషన్ స్వరం ఓం.. అన్ని భాషలకు.. అన్ని అక్షరమాలలకు ఊపిరులిచ్చిన ప్రణవం ఓం.. ప్రణవం గురించి ప్రపంచంలో ప్రాథమికంగా తెలియని వాళ్లు ఉండరు. కానీ, ఆ ప్రణవం ఎలా పుట్టిందన్నది చాలామందికి తెలియదు.. శబ్దం ఒకచోట పుట్టడం ఏమిటన్నది చాలామందికి వచ్చే అనుమానమే. సైన్స్కయితే ఇది ఓ వెర్రి ప్రశ్న. కానీ, భారతీయ ఆధ్యాత్మిక భావభూమికలలో ప్రణవం పరమేశ్వరుడి సృష్టి. ఆయన చేతిలోని ధమరుకం నుంచి ధ్వనించిన తొలి స్వరమది. ఇందుకు హేతుబద్ధత చాలానే ఉంది. 27 మహాయుగాలకు ముందు భూమి ఆవిర్భవించింది. ఈ భూమి మీద జీవికంటే ముందు శబ్దం పుట్టింది. ఆ శబ్దమే ఓంకారం.. ప్రణవ నాదం. ఇది ఒక చోట పుట్టడమేమిటన్న ప్రశ్న మళ్లీ ఉదయిస్తుంది. కానీ, ఇది ఒకచోట ఆవిర్భవించింది. మహాశివుడి కరుణతో అవతరించింది. ఉమాపతి కైలాసంలో పుట్టుకొచ్చింది. రుద్ర తాండవమూర్తి నాదసాధనం నుంచి ఆవిర్భవించిన ప్రణవం. ఇంతకీ ఈ ఓంకారం పుట్టిందెక్కడ..? ఈశ్వరుడి నిజనివాసం కైలాసం అని తెలిసిందే. మనకు తెలిసిన కైలాసం మౌంట్ కైలాస్. మానస సరోవరం సమీపంలో ఉన్న కైలాసం.. శివుడు కైలాసంలోనే ఉంటాడు. ప్రణవం కైలాసంలోనే జన్మించింది. కానీ, అది మౌంట్ కైలాస్లో కాదు. పరమ మహేశ్వరుడు మొట్టమొదట జ్యోతిస్వరూపుడిగా ఉద్భవించిన ఆది కైలాసంలో.. ఆయన త్రిశూలం.. ధమరుకం జ్వాలాముఖి నుంచి పుట్టుకొచ్చిన కైలాసంలో.. అది ఈ అసలైన కైలాసానికి దూరంగా ఉంది. దాని పేరు ఆది కైలాసం. ఓం పర్వతం. ప్రాణాయామానికి ప్రాణాధార పర్వతం. ఈశ్వరుడి తపోభూమి. శివతాండవానికి ఆది పర్వతం. త్రినేత్రుడి దివ్యధామం.

పురాణాల కథనం ప్రకారం శివుడు అయిదు కైలాసాలను సృష్టించాడు. అందులో మౌంట్ కైలాస్ ఆయన నిజనివాసం. మిగతా నాలుగు కైలాసాలు ఆయన వేర్వేరు సందర్భాల్లో సృష్టించినవి. అందులో ఒకటి ఆది కైలాసం.. ఆయన భూమిపై జ్యోతి స్వరూపంగా ఆవిర్భవించిన ప్రదేశం. ఈ భూమిపైన అవతరించిన హిమాలయ శిఖరాలలో ఆది కైలాసం శివస్వరూపానికి ప్రతీక. ఉత్తరాఖండ్.. హిమాలయాల తూర్పు కనుమలు ఉన్న ప్రాంతం. పితోర్ఘ జిల్లా సిన్లా పాస్లో ఈ ఆదికైలాసం ఉంది. సముద్ర మట్టానికి 6191 మీటర్ల ఎత్తులో 20 వేల 312 అడుగుల ఎత్తైన పర్వతం ఇది. ఇదే ఓం పర్వతం. ఓంకారాన్ని అక్షరరూపంలో ప్రతిబింబించిన పర్వతం. హిందువులకు అతి పవిత్రమైన పర్వతాలలో ఓం పర్వతం ఒకటి. పర్వతం ఎలా ఏర్పడిందో తెలియదు. ఎత్తులో, ఆకారంలో మిగతా హిమాలయ సానువుల్లాగానే 'ఇదీ వుంటుంది. కానీ, దీనిని చూడగానే పవిత్ర మూల మంత్రం గుర్తుకువస్తుంది. మనిషికి, దేవుడికి మధ్య అనుసంధానం కనిపిస్తుంది. నాదం శబ్దమై.. శబ్దం అక్షరంగా మారిన పరిణామ ప్రక్రియ గోచరిస్తుంది. ఆధ్యాత్మిక అత్యున్నత స్వరధుని వినిపిస్తుంది. ఓం పర్వతాన్ని శివుడి చేతిలో ధమరుకంగా భక్తులు విశ్వసిస్తారు. అక్షరమాల అంతా ఆ ధమరుకంనుంచే పుట్టిందని శివపురాణం చెప్తుంది. పర్వతంపై కనిపించే ప్రణవ రూపం దీన్ని నిజం చేస్తోంది. చిత్రంలో చూస్తే అర్థమవుతుంది ఈ పర్వతం తన రూపంలోనే ఓంకారం అచ్చంగా కనిపిస్తుంది. ఓంకారాన్ని హిందువులు సగుణ బ్రహ్మమని అంటారు. అంటే రూపం లేని దేవుడు కావలసిన ఆకారంలో కనిపించటం.. ఓం పర్వతం అచ్చంగా ఆ సగుణ బ్రహ్మానికి ప్రతీక. దేవుడికి పేరంటూ ఉంటే ఆ పేరు ఓం.. దానికి రూపం ఈశ్వరుడి ఆత్మలింగం. అదే ఇక్కడి ఓం పర్వతం.. ఆది కైలాసం.. చోటా కైలాస్.

# డిజిటల్ సంకెళ్లలో బాల్యం




రణధీర్ గుండు
టెక్ నిపుణుడు




నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతికత ఒక అనివార్య భాగమైంది. అయితే, ఇదే సాంకేతికత చిన్నారుల పాలిట శాపంగా మారుతోంది. ఆటపాటలతో, తోటి పిల్లలతో గడపాల్సిన బాల్యం.. నేడు నాలుగు గోడల మధ్య స్మార్ట్ఫోన్ తెరలకు పరిమితమైపోతోంది. 'డిజిటల్ వ్యసనం' అనే ఈ నిశబ్ద మహమ్మారి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. గంటల తరబడి మొబైల్ స్క్రీన్ల వైపు చూడటం వల్ల పిల్లల్లో దృష్టి లోపాలు, నిద్రలేమి, ఊబకాయం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కేవలం శారీరక ఆరోగ్యమే కాకుండా, వారి మెదడు పనితీరుపై కూడా ఇది ప్రభావం చూపుతోంది. ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తి మందగించడం, చిన్న విషయాలకే చిరాకు పడటం, ఒంటరితనానికి లోనవ్వడం వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆన్లైన్ ఆటలకు బానిసలై ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. పిల్లలు డిజిటల్ వ్యసనానికి లోనవడానికి ప్రధాన కారణం తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమే. తమ పనికి ఆటంకం కలగకూడదని లేదా పిల్లలు ఏడుస్తున్నారని వారి చేతికి మొబైల్ ఇవ్వడం ఒక అలవాటుగా మారింది. ఇది వారిని స్లో పాయిజన్ లాంటి వ్యసనంలోకి నెట్టడమే. పిల్లలకు డిజిటల్ క్రమశిక్షణ నేర్పించడంలో పెద్దలే రోల్ మోడల్స్గా ఉండాలి. ఇంట్లో ఫోన్ వాడకాన్ని తగ్గించి, పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపాలి. రోజులో కొంత సమయం మాత్రమే డిజిటల్ పరికరాలకు అనుమతి ఇవ్వాలి. పిల్లలను బయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఇది వారిలో సామాజిక స్పృహను, శారీరక ధృఢత్వాన్ని పెంచుతుంది. కథల పుస్తకాలు చదవడం వంటి అలవాట్లను పెంపొందించాలి. పాఠశాలల్లో డిజిటల్ వ్యసనం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలి. సాంకేతికతను జ్ఞాన సముపార్జనకు వాడుకోవాలే తప్ప, అది జీవితాన్ని శాసించే స్థాయికి వెళ్లకూడదు. రేపటి పౌరులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కుటుంబం, పాఠశాల మరియు సమాజంపై ఉంది. డిజిటల్ బానిసత్వం నుంచి మన పిల్లలను విముక్తులను చేసి, వారికి అందమైన, ఆరోగ్యకరమైన బాల్యాన్ని బహుమతిగా ఇద్దాం.


## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010.